Follow: @ANNTELUGU

ANN తెలుగు

15-01-2026

# మహా పత్రిక

గురువారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 21 పేజీలు-08 వెల-రూ.6

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## సంబరాల.. సంక్రాంతి

### వెలుగులు తెచ్చే పండుగ

**మహా ప్రత్యేకం:** సూర్యభగవానుడు మకరరాశిలోకి ప్రవేశించే రోజే సంక్రాంతి. దక్షిణాయనం పూర్తయి ఉత్తరాయణ పుణ్యకాలం ప్రవేశించే సమయం కనుక 'ఉత్తర క్రాంతి' అని కూడా పిలుస్తారు. సూర్యుడు ఒక్కో నెలలో ఒక్కో రాశిలోకి ప్రవేశిస్తాడు. అలా ఏడాదికి పన్నెండు సంక్రాంతులొస్తాయి. కానీ మకర సంక్రమణం నుంచి భాస్కరుడు ప్రచండ తేజస్సుతో ప్రకాశిస్తాడు.

ప్రత్యేక కథనం 4లో

**టాప్ న్యూస్**



పొంగల్ ఇంటర్నేషనల్ సెలబ్రేషన్స్‌లో మోదీ

02

## వన్డే ర్యాంకింగ్స్.. కోహ్లీ టాప్ 1



02

## భగ్గుమన్న వెండి

- ఒక్కరోజే రూ.12 వేల పెరుగుదల
- నాలుగు రోజుల్లో రూ.35 వేల పెరుగుదల

02



## పంచాయతీలకు.. పైసలొస్తున్నాయ్

- రూ. 2,500 కోట్లు విడుదలకు కేంద్రం గ్రీన్ సిగ్నల్
- ఈనెలాఖరుకు వేయికోట్లు విడుదల
- ఫలించిన రాష్ట్ర ప్రభుత్వ ప్రయత్నాలు

02

### రేపు చనాకా-కొరాటకు

# సీఎం రేవంత్

## నాలుగు దశాబ్దాల రైతుల కల సాకారం

- ఆదిలాబాద్, నిర్మల్ నియోజకవర్గాల్లో పర్యటన
- నిర్మల్ నుండే పుర శంఖారావం
- ఏర్పాట్లు పరిశీలించిన మంత్రి జూపల్లి, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి

**హైదరాబాద్, ఆదిలాబాద్, మహా :** ఆదిలాబాద్ జిల్లా రైతాంగం నాలుగుదశాబ్దాల కల నెరవేర్చేదిశగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వాసులకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో ప్రారంభించిన చనాకకొరాట ప్రాజెక్టును అందుబాటులోకి తీసుకురావాలని సీఎం నిర్ణయించారు. ఇందులో బాగంగా సీఎం రేవంత్‌రెడ్డి ఈ నెల 16న ప్రాజెక్టు సందర్శనకు వెళ్తున్నారు. భోరాజ్ మండలం హాతీఘాట్ గ్రామంలో పంప్‌హౌస్‌ను ప్రారంభించనున్నారు. ఈ నెల 16న సీఎం రేవంత్‌రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పర్యాటక శాఖా మంత్రి జూపల్లి, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, ఇతర మంత్రులు పర్యటిస్తున్నారు. ఈ ప్రాజెక్టు



తెలంగాణ, మహారాష్ట్రల సంయుక్త ప్రాజెక్టు కాగా.. ఇరు రాష్ట్రాల భాగస్వామ్యంతో నిర్మితమైంది. ఇది పెన్‌గంగా నదిపై 6,677 హెక్టార్ల విస్తీర్ణానికి నిర్మింతమైంది. తెలంగాణలో 5,463 హెక్టార్లు, మహారాష్ట్రలో 1,214 హెక్టార్లకు సాగునీరు అందించడానికి ప్రతిపాదించారు.

మిగతా 2లో

## సెలవు

గురువారం సంక్రాంతి పండుగ రోజు కావున మహా పత్రిక ఆఫీసుకు సెలవు దినం... శుక్రవారం పత్రిక వెలువడదు.

**పున: దర్శనం శనివారం**







## ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా మహా పత్రిక

- మేలు కొలిపే మహా పత్రిక కథనాలు భేష్ మంత్రి కొండా సురేఖ
- 2026 మహా పత్రిక క్యాలండర్ ను ఆవిష్కరించిన మంత్రి

వివరాలు 2లో



## వన్డే ర్యాంకింగ్స్..
# కోహ్లీ టాప్ 1

**మహా :** భారత స్టార్ ఆటగాడు విరాట్ కోహ్లీ పురుషుల వన్డే క్రికెట్ ర్యాంకింగ్స్‌లో నాలుగేళ్ల తర్వాత తొలిసారి నంబర్ 1 స్థానానికి దూసుకెళ్లాడు. పురుషుల వన్డే ర్యాంకింగ్స్‌ను జాబితాను ఐసీసీ తాజాగా విడుదల చేసింది. ఇటీవల కోహ్లీ అద్భుత ప్రదర్శన చేస్తుండడంతో మళ్లీ తొలిస్థానం నిలబెట్టుకున్నాడు. 2021లో చివరిసారిగా కోహ్లీ టాప్ 1గా ఉన్నాడు. ఇక మరో స్టార్ బ్యాటర్ రోహిత్ శర్మ మూడో స్థానంలో నిలిచాడు.

## ముగ్గురు జర్నలిస్టుల అరెస్ట్

- ఎన్టీవీ కార్యాలయంలో సిట్ సోదాలు
- అరెస్ట్ లను ఖండించిన నేతలు, జర్నలిస్ట్ సంఘాలు

**మహా:** తెలుగు మీడియా రంగంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ముగ్గురు ఎన్టీవీ జర్నలిస్టులను పోలీసులు అరెస్టు చేశారు. ఓ మంత్రి, మహిళా ఐఎఎస్ అధికారిని టార్గెట్ చేస్తూ కథనాలు ప్రసారం చేసినందుకు అదుపులోకి తీసుకున్నారు. ఎన్టీవీ ఇన్‌పుట్ ఎడిటర్ దొంతు రమేష్, ఇద్దరు రిపోర్టర్లు పరిపూర్ణ చారి, సుధీర్‌లను అర్ధరాత్రి అరెస్టు చేశారు. ఎలాంటి ప్రోసిజర్ లేకుండా, నోటీసులు ఇవ్వకుండా అరెస్టు చేయడాన్ని ఎన్టీవీ సిబ్బంది ఖండించారు. మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్ రావు, కేంద్రమంత్రి బండిసంజయ్, బిజెపి చీఫ్ రామచందర్ రావు జర్నలిస్టులను అరెస్టు చేయడాన్ని ఖండించారు. ఎలాంటి నోటీసులు ఇవ్వకుండానే ఎన్టీవీ ఆఫీసులో సిట్ అధికారులు సోదాలు చేయడం సరికాదన్నారు. అరెస్ట్ లను పలు జర్నలిస్ట్ సంఘాలు ఖండించాయి.

## ఎన్టీవీపై సీఎం రేవంత్ సీరియస్

**.. లైసెన్స్ రద్దు చేయాలంటూ ఆదేశం**

**హైదరాబాద్, మహా:** తెలంగాణ మంత్రి , ఓ మహిళా ఐఏఎస్ అధికారిని టార్గెట్ చేస్తూ కథనాలు ప్రసారం చేసిన వ్యవహారంపై సీఎం రేవంత్ ఎన్టీవీపై సీరియస్‌గా ఉన్నట్లు తెలిసింది. ఆ ఛానల్ లైసెన్స్‌ను రద్దు చేయాలని కోరుతూ కేంద్ర సమాచార శాఖకు లేఖ రాయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కథనాలపై ఐఎఎస్, ఐపీఎస్ అధికారులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేసిన నేపథ్యంలో సీఎం ఆగ్రహంగా ఉన్నారు. బూతు కథనాన్ని సోషల్‌మీడియాలో ప్రచారం చేసినవారిపై కఠినంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ వ్యవహారానికి మద్దతిస్తున్న బీఆర్ఎస్, వైసీపీలకు సరైన సమాధానం ఇవ్వాలని పార్టీ వర్గాలకు ఆదేశించారు. ఎన్టీవీకి మద్దతుగా మాట్లాడిన జగ్గారెడ్డిపై కూడా రేవంత్ అసహనం వ్యక్తం చేశారు. ఈ బూతు వార్త కథనం వెనుకున్నవారు ఎంతవారైనా అరెస్టు చేయాలంటూ ఆదేశాలు జారీ చేశారు. కష్టపడి సివిల్ సర్వీసెస్‌కు ఎంపికైన మహిళా అధికారుల పట్ల ఇలాంటి కథనాలు ప్రచారం చేయడం వాళ్ల ఆత్మ గౌరవాన్ని దెబ్బతీయడమేనని ఐఏఎస్ ల సంఘం ధ్వజమెత్తింది. ఫిర్యాదు మేరకు దీనిపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు ముగ్గురు ఎన్టీవీ జర్నలిస్టులను అరెస్టు చేశారు.

## భగ్గుమన్న వెండి

**ఒక్కరోజే రూ.12 వేల పెరుగుదల**

**నాలుగురోజుల్లో రూ.35వేల పెరుగుదల**

**మహా:** ఫ్యూచర్ మార్కెట్‌లో కిలో వెండి ధర ఒక్కరోజే రూ.12 వేలకు పైగా పెరగగా, కొత్త సంవత్సరంలో రూ.52 వేలు పెరగడం విశేషం. బంగారం 10 గ్రాములు రూ.1.43 లక్షల వద్ద ట్రేడ్ అవుతోంది. వెండి ధర నాలుగు రోజుల్లోనే రూ.35 వేలు పెరిగింది. గత ఏడాది డిసెంబర్ 31 నాటికి రూ.2.35 లక్షలుగా ఉన్న వెండి ధర 2026లో రూ.52 వేలు పెరిగింది. ఫ్యూచర్ మార్కెట్‌లో బంగారం ఫిబ్రవరి కాంట్రాక్ట్ ఒక్కరోజులో రూ.932 పెరిగి రూ.1.43 లక్షలకు చేరుకుని సరి కొత్త రికార్డును నమోదు చేసింది.



## ఘనంగా ఉప్పల జన్మదిన వేడుకలు

**ఆమనగల్లు, మహా :** అమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి, మాడ్గుల మండలాలు, ఆయా గ్రామాల్లో మాజీ మిషన్ భగీరథ వైస్ చైర్మన్, తలకొండపల్లిమాజీ జడ్పిటిసి, ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ అధినేత ఉప్పల వెంకటేష్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ముఖద్వారం కడ్తాల్ నుండి ఉప్పల వెంకటేష్ ను అభిమానులు బాణాసంచా పేలుస్తూ ర్యాలీతో ఘన స్వాగతం పలికారు. బిఆర్ఎస్ శ్రేణుల ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలను అభిమానులు, కార్యకర్తలు సమక్షంలో ఏర్పాటు చేసిన భారీ కేక్ను కట్టింగ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉప్పల ట్రస్ట్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## రేపు చనాకా-కొరాటకు
# సీఎం రేవంత్

(మొదటిపేజీ తరువాయి)

కమాండ్ ఏరియా మూడు మండలాల్లోని 14 గ్రామాలలో ఉంది. తెలంగాణలోని ఆదిలాబాద్ జిల్లాలోని తాంసి, ఆదిలాబాద్, జైనథ్, మహారాష్ట్రలోని యావత్మల్ జిల్లాలోని కేలాపూర్ తహసీల్‌లోని తొమ్మిది గ్రామాలకు సాగునీరు అందించనున్నారు. సీఎం పర్యటన నేపథ్యంలో ఏర్పాట్లను మంత్రి జూపల్లి క్రిష్ణారావు, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, కలెక్టర్ రాజర్షిషా, ఎస్పీ అఖిల్ మహాజన్, ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజక వర్గ ఇన్ ఛార్జి కంది శ్రీనివాసరెడ్డి తదితరులు పరిశీలించారు.

**పెండింగ్ ప్రాజెక్టులు చకచకా**

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను ప్రాధాన్యత క్రమంలో పూర్తిచేయాలని నిర్ణయించింది. ఇందులో చనాకకొరాటను సైతం తీసుకుంది. గత బడ్జెట్‌లో ఈ ప్రాజెక్టు పూర్తికి రూ.179 కోట్లు సైతం కేటాయించింది. గత బీఆర్ఎస్ హయాంలో పంప్‌హౌజ్, రిజర్వాయర్, డిస్ట్రిబ్యూటర్ల నిర్మాణాన్ని ప్రారంభించారు. ముందుగా రూ.386 కోట్ల అంచనాతో చేపట్టగా, ఫండ్స్ సరిపోవడం లేదంటూ రూ.1,227 కోట్లకు పెంచారు. అయినా.. ప్రాజెక్టు పూర్తి కాలేదు. రూ.2 వేల కోట్లకు అంచనాలు పెంచినప్పటికీ, నిధులు విడుదల చేయకపోవడంతో సాగునీరు అందని పరిస్థితి నెలకొంది. 2018లోనే ఈ ప్రాజెక్టు పూర్తిచేయాల్సి ఉండగా నిధుల కొరతతో పదేళ్లుగా గడువు పెంచుతూ వస్తున్నారు. చనాకకొరాట బ్యారేజికి భూసేకరణ పెండింగులో ఉన్నందున షెడ్యూల్ ప్రకారం పని పూర్తి కాలేదు. ఇప్పటివరకు భూసేకరణ ఇతర వ్యయాలతోపాటు ఈ ప్రాజెక్టుపై చేసిన వ్యయం రూ.1244.66 కోట్లు. ఇంకా కావలసిన నిధులు రూ. 792.91 కోట్లు. 2027, డిసెంబరు నాటికి పూర్తి చేసేలా కేటగిరిబి క్రింద ప్రాజెక్టుకు ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోంది. ఆ ప్రకారంగా, 202526 ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో భూసేకరణ, ఇతర పనుల కోసం రూ.147.00 కోట్ల నిధులను కేటాయించడమైంది. రూ.71.96 కోట్ల భూసేకరణ బిల్లులను జిల్లా కలెక్టరు ఖాతాకు జమ చేశారు. వచ్చే ఏడాది చివరికల్లా ప్రాజెక్టు పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్ణయించుకుంది.



**నిర్మల్ లో బహిరంగసభ**

నిర్మల్ లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బహిరంగ సభ జరగనుంది. సెంటిమెంట్ ప్రకారం ఎన్నికల శంఖారావం ఆదిలాబాద్ ప్రాంతం నుండే ప్రారంభిస్తున్నారు. నిర్మల్ లో బహిరంగసభకు వివిధ మునిసిపాలిటీల నుండి ప్రజలు పెద్ద ఎత్తున హాజరుకానున్నారు. ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, నిర్మల్ జిల్లా డిసిసి అధ్యక్షులు వెడ్మ బొజ్జు, మాజీ కేంద్రమంత్రివర్యులు వేణుగోపాలచారి, మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి, నిర్మల్ జిల్లా కలెక్టర్, ఎస్పీ సభ ఏర్పాట్లు పరిశీలించారు

## ప్రతి ఒక్కరు మన సంస్కృతి సాంప్రదాయాలను కాపాడుకోవాలి

**కార్పొరేటర్ గండె కల్పన నవీన్..**

**200 మందికి పతంగులు పంపిణీ చేసిన కార్పొరేటర్**



**వరంగల్ మహా;** వరంగల్ నగరంలోని 28వ డివిజన్ పిన్న వారి వీధిలో వరంగల్ జిల్లా మహేష్ బాబు యువసేన ఆధ్వర్యంలో స్థానిక కార్పొరేటర్ గండె కల్పన నవీన్ 200 మందికి ఉచితంగా పతంగులు, మాంజాల తో పాటు చెరకాలు పంపిణీ చేశారు. దీనిలో ప్రత్యేకత ఏమిటంటే దేశ ప్రధాని నరేంద్ర మోడీ 500 మందికి పతంగులు మాంజాలు చరకాలు పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా గండె కల్పన నవీన్ మాట్లాడుతూ నిషేధిత చైనా మాంజా ను వినియోగించవద్దని, ప్రతి ఒక్కరూ ఇంటి ముందు ముగ్గులు వేసుకొని పిండి వంటలు చేసుకుని మన సంస్కృతి సాంప్రదాయాలను ప్రతి ఒక్కరూ పాటిస్తూ వాటిని కాపాడుకోవడం మన బాధ్యత అని తెలిపారు. ముఖ్యంగా తగు జాగ్రత్తలు పాటిస్తూ మైదానాలు, భవనాల పై గాలి పటాలను ఎగరవేస్తూ మన తెలంగాణ సంస్కృతిని చాటుతూ సంక్రాంతి పండుగను ఘనంగా చేసుకోవాలని మన మాంజాలు మన పతంగులే వాడాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ప్రజలందరికీ సంక్రాంతి కనుమ పండుగల శుభాకాంక్షలు తెలిపారు.

## పంచాయతీలకు.. పైసలొస్తున్నాయ్

- రూ. 2,500 కోట్లు విడుదలకు కేంద్రం గ్రీన్ సిగ్నల్
- ఈనెలాఖరుకు వేయికోట్లు విడుదల
- ఫలించిన రాష్ట్ర ప్రభుత్వ ప్రయత్నాలు

**హైదరాబాద్, మహా:** గ్రామపంచాయతీ ఎన్నికలు నిర్వహించి కేంద్ర నిధులు రాబట్టాలన్న వ్యూహం ఫలించింది. తెలంగాణ గ్రామ పంచాయతీలకు కేంద్రం నుంచి రూ. 2,500 కోట్ల నిధులు విడుదల కానున్నాయి. ఇన్నాళ్లూ నిధులు లేక.. గ్రామ సమస్యలను తీర్చలేక సతమతమవుతున్న గ్రామ పంచాయతీలకు నిధుల సమస్యను తీర్చనుంది. కేంద్రం నుంచి రావాల్సిన 15వ ఆర్థిక సంఘం నిధుల విడుదలకు మార్గం సుగమమైంది. ఈ నెలాఖరులోపు కనీసం రూ.వెయ్యి కోట్లను కేంద్రం విడుదల చేయనున్నట్లు తెలిసింది. మిగిలిన నిధులను వచ్చే నెలలో విడుదల చేసేందుకు అంగీకరించిందని తెలుస్తోంది. సర్పంచ్ ఎన్నికలు ముగియడంతో నిధుల విడుదలకు మార్గం సుగమమైంది. ఈ నిధులతో గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టాలని, ప్రత్యేక బ్యాంకు ఖాతాలు తెరిచి, డిజిటల్ సిగ్నేచర్లతో పనులు పూర్తి చేయాలని అధికారులు సూచించారు. పల్లెల్లో కొత్త వెలుగులు సంతరించుకోనున్నాయి.రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికలు ముగిసి.. కొత్త పాలక వర్గాలు బాధ్యతలు చేపట్టడంతో నిధుల విడుదలకు ఉన్న ఆటంకాలన్నీ తొలగిపోయాయి. సంక్రాంతి కానుకగా రాష్ట్ర ప్రభుత్వం కూడా తన వంతుగా రూ. 277 కోట్లను విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

## ఖాకీ దుస్తులు తీసేసి కాంగ్రెస్ కండువా కప్పుకో

- సీపీ సజ్జనార్ పై మాజీ మంత్రి హరీష్ రావు ఆగ్రహం
- జర్నలిస్టుల అరెస్టును సమర్థించడం సరికాదని వ్యాఖ్య



**హైదరాబాద్, మహా :** హైదరాబాద్ సీపీ సజ్జనార్ పై మాజీ మంత్రి, బీఆర్ఎస్ కీలక నేత హరీష్‌రావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. జర్నలిస్టుల అరెస్టులను సమర్థిస్తూ సజ్జనార్ మాట్లాడటాన్ని తప్పుబడుతూ, ఆయన తీరుపై హరీష్ రావు ఘాటుగా స్పందించారు. పోలీసు అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించాల్సింది పోయి, అధికార పార్టీ కార్యకర్తల్లా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. సజ్జనార్ గారు.. మీరు పోలీసు అధికారిలా కాకుండా కాంగ్రెస్ ప్రతినిధిలా మాట్లాడుతున్నారు. మీకు అంతగా ఇష్టముంటే ఖాకీ చొక్కా తీసేసి, కాంగ్రెస్ కండువా కప్పుకుని రాజకీయం చేయండి అంటూ ఘాటుగా విమర్శించారు. జర్నలిస్టుల అరెస్టులను వెనకేసుకురావడం ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు అని ఆయన ధ్వజమెత్తారు. గతంలో మంత్రి కొండా సురేఖ, కేటీఆర్ పై, ఒక అగ్ర నటిపై చేసిన అసభ్యకర వ్యాఖ్యలను హరీష్ రావు ఈ సందర్భంగా గుర్తు చేశారు. "ఆనాడు కేటీఆర్ గారి మీద, ఆయన కుటుంబం మీద కొండా సురేఖ నోటికొచ్చినట్లు మాట్లాడినప్పుడు మీ చట్టం ఎటు పోయింది సజ్జనార్ గారు? అప్పుడు మహిళా గౌరవం మీకు గుర్తుకు రాలేదా?" అని ప్రశ్నించారు. కేటీఆర్ విషయంలో బాధపడింది కూడా ఆయన భార్య, తల్లి రూపంలో ఉన్న మహిళలే కదా అని ప్రశ్నించారు. అప్పుడు ఎందుకు చర్యలు తీసుకోలేదు, ఇప్పుడు జర్నలిస్టులను ఎందుకు వేధిస్తున్నారని ఆయన నిలదీశారు. జర్నలిస్టులను అర్ధరాత్రి అరెస్టు చేయడాన్ని హరీష్ రావు తీవ్రంగా ఖండించారు. ఎవరైనా తప్పు చేస్తే చట్టప్రకారం నోటీసులు ఇచ్చి విచారించాలని, కానీ దొంగల్లాగా ఇళ్లలోకి చొరబడి భయభ్రాంతులకు గురిచేయడం ఏంటని ప్రశ్నించారు. కేవలం ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారనే కక్షతోనే జర్నలిస్టులపై అక్రమ కేసులు పెడుతున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో ఎమర్జెన్సీ లాంటి పరిస్థితులు కనిపిస్తున్నాయని, ప్రశ్నించే గొంతులను అణిచివేయాలని చూస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. మహిళా అధికారుల గౌరవం గురించి మాట్లాడుతున్న సజ్జనార్, ప్రతిపక్ష పార్టీ నేతల కుటుంబాల్లోని మహిళల గౌరవం గురించి ఎందుకు మాట్లాడటం లేదని హరీష్ రావు ప్రశ్నించారు. అధికార పార్టీ నేతలు అసభ్యంగా మాట్లాడితే ఒక చట్టం, ఇతరులపై మరొక చట్టం ఉంటుందా అని అడిగారు. చట్టం అందరికీ సమానంగా ఉండాలని, పోలీసు యంత్రాంగం కాంగ్రెస్ చేతిలో కీలుబొమ్మగా మారడం దురదృష్టకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

## అప్పుల పాలైన భర్త కోసం హైదరాబాద్ లో దొంగగా మారిన భార్య

**హైదరాబాద్, మహా:** వ్యాపారంలో నష్టపోయి అప్పుల పాలైన భర్త కోసం తాను కూడా కష్టపడాలని, డబ్బు సంపాదించాలని భార్య నిర్ణయించుకుంది.. తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించడానికి దొంగగా మారింది. ఓ వృద్ధురాలి మెడలో నుంచి బంగారు గొలుసు ఎత్తుకెళ్లింది. హైదరాబాద్ లోని సనత్ నగర్ ప్రాంతం అవంతీనగర్ లో ఈ ఘటన చోటుచేసుకుంది. బాధితురాలి ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు.. అరగంటలోనే దొంగను పట్టుకున్నారు. వివరాల్లోకి వెళితే.. వరంగల్ కు చెందిన అనితా రెడ్డి ఉన్నత చదువులు చదివి చెన్నైలో కొంతకాలం సాఫ్ట్ వేర్ ఉద్యోగం చేసింది. మేడ్చల్ కు చెందిన రాజేశ్ తో రెండేళ్ల క్రితం ఆమెకు వివాహం జరిగింది. ఈ దంపతులకు ఓ పాప ఉంది. రాజేశ్ చేస్తున్న ఫైనాన్స్ వ్యాపారంలో నష్టాలు రావడంతో అప్పుల పాలయ్యాడు. అప్పులు తీర్చేందుకు భర్త పడుతున్న బాధను చూడలేక తాను కూడా డబ్బు సంపాదించాలని అనిత దొంగగా మారింది. ఈ నెల 13న అవంతీనగర్ లో ఓ వృద్ధురాలిని వెంబడించిన అనిత.. బిల్డింగ్ లిఫ్ట్ లో ఆమె మెడలోని మంగళసూత్రం కొట్టేసి పారిపోయింది. బాధితురాలు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయగా.. సీసీటీవీ ఫుటేజీలు పరిశీలించిన పోలీసులు అనితను గుర్తించి అరగంటలోనే అదుపులోకి తీసుకున్నారు. భర్త చేసిన అప్పులు తీర్చడానికే దొంగతనం చేసినట్లు అనిత పోలీసులకు వెల్లడించింది.

## పొంగల్ ఇంటర్నేషనల్ సెలబ్రేషన్స్ లో మోదీ



**మహా:** ఇప్పుడు 'పొంగల్' అంతర్జాతీయ పండుగగా మారిందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. తమిళులతో పాటు యావత్ ప్రపంచంలో తమిళ సంస్కృతిని ప్రేమించే వారు ఆనందోత్సాహాలతో పొంగల్ వేడుకను జరుపుకుంటారని ఆయన పేర్కొన్నారు. తమిళ సంస్కృతిని ప్రేమించే వారిలో తాను కూడా ఒకడినని మోదీ తెలిపారు. అందరితో కలిసి పొంగల్ వేడుకలలో భాగం కావడాన్ని తాను ప్రత్యేక గౌరవంగా భావిస్తున్నానని చెప్పారు. బుధవారం దేశ రాజధాని ఢిల్లీలో కేంద్ర మంత్రి ఎల్ మురుగన్ నివాసంలో జరిగిన పొంగల్ వేడుకల్లో ప్రధాని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో పలువురు కేంద్ర మంత్రులు, బ్యూరోక్రాట్లు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. పొంగల్ పండుగ మన జీవితానికి ఆనందకర అనుభవాన్ని ప్రసాదిస్తుందని మోదీ అన్నారు. అన్నదాతల శ్రమను గుర్తిస్తూ, ప్రకృతి మాతకు, పుడమి తల్లికి, సూర్య భగవానుడికి కృతజ్ఞతలు తెలుపుకునే అపురూప సందర్భం పొంగల్ అని ఆయన కొనియాడారు.

## ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా మహా పత్రిక

**మేలు కొలిపే మహా పత్రిక కథనాలు భేష్ మంత్రి కొండా సురేఖ**

**2026 మహా పత్రిక క్యాలండర్ ను ఆవిష్కరించిన మంత్రి**



**వరంగల్ మహా;** వాస్తవ కథనాలను ప్రచురిస్తూ ప్రజలను చైతన్య పరుస్తూ అధికారులను మేలు కొలుపుతూ పత్రికా రంగంలోనూ ప్రసార రంగంలోనూ ఓ కొత్త ఒరవడిని సృష్టించిన మహా తెలుగు దినపత్రిక, ఏఎన్ఎన్ చానల్ వార్త కథనాలు అభినందనీయమని రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ పర్యావరణ అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ అనతి కాలంలోనే ప్రజాదరణ పొంది నిష్పక్షపాతంగా ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా పనిచేస్తున్న మహా పత్రికా యజమాన్యానికి ఈ సందర్భంగా మంత్రి శుభాకాంక్షలు తెలిపారు. భోగి పండుగ సందర్భంగా బుధవారం మహా తెలుగు దినపత్రిక 2026 ఆంగ్ల నూతన సంవత్సర క్యాలండర్ ను మంత్రి కొండా సురేఖ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మహా పత్రిక యజమాన్యానికి, ప్రతినిధులకు, సిబ్బందికి, రాష్ట్ర ప్రజలకు సంక్రాంతి కనుమ పండుగల శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకులు గోపాల్ నవీన్ రాజ్, సీనియర్ నాయకులు మీసాల ప్రకాష్, 28వ డివిజన్ అధ్యక్షులు కురిమళ్ళ సంపత్ కుమార్, మాజీ కార్పొరేటర్లు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పల్లెల్లో సంబురంగా ముగ్గుల పోటీలు



**ఆమనగల్లు మహా:** కల్వకుర్తి నియోజకవర్గంలోని ప్రతి పల్లెలో భోగి పర్వదినం సందర్భంగా బుధవారం నిర్వహించిన ముగ్గుల పోటీలు సంబురంగా జరిగాయి. మిషన్ భగీరథ మాజీ వైస్ ఛైర్మన్ ఉప్పల వెంకటేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీలలో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం పోటీలలో విజేతలైన మహిళలకు నిర్వాహకులు ప్రథమ, ద్వితీయ, తృతీయ, కన్సోలేషన్ బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## మునిసిపల్ రిజర్వేషన్లు ఖరారు

**జనరల్ కు 30.. జనరల్ మహిళకు 31.. బీసీలకు 38 మునిసిపాలిటీలు**

**హైదరాబాద్, మహా:** తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల నిర్వహణ కోసం పురపాలక శాఖ రిజర్వేషన్ల కసరత్తు ప్రారంభించింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళా స్థానాల సంఖ్య ఖరారు చేసింది. 121 మున్సిపాలిటీల్లో ఛైర్‌పర్సన్ల సంఖ్యను ఖరారు చేసింది. మున్సిపాలిటీల్లో జనరల్ 30, జనరల్ మహిళ 31, ఎస్టీ జనరల్ 3, ఎస్టీ మహిళ 2, ఎస్సీ జనరల్ 9, ఎస్సీ మహిళ 8, బీసీ జనరల్ 19, బీసీ మహిళలకు 19 స్థానాలను కేటాయిస్తున్నారు. పది కార్పొరేషన్లలో జనరల్ 1, జనరల్ మహిళ 4, బీసీ జనరల్ 2, ఎస్సీ 1, ఎస్టీ 1, బీసీ మహిళలకు 1 స్థానాలను కేటాయిస్తున్నారు. ఈ నెల 17న రిజర్వేషన్లు ఖరారు చేయనున్నారు. 2011 జనాభా లెక్కల ప్రకారం ఎస్సీ, ఎస్టీ స్థానాల కేటాయింపు.. డెడికేటెడ్ నివేదిక ఆధారంగా బీసీ స్థానాల సంఖ్య కేటాయింపు జరుగుతోంది.

## జర్నలిస్టుల అరెస్టును ఖండించిన టి డబ్ల్యు జె ఏ

**హైదరాబాద్:** రాష్ట్ర కేబినెట్ లోని మంత్రిపై ఎన్టీవీ మీడియాలో ప్రసారమైన కథనంలో భాగంగా సీనియర్ జర్నలిస్టులైన దొంతు రమేశ్, పరిపూర్ణ చారి, సుధీర్ ను అరెస్ట్ చేయటాన్ని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు అస శ్రీరాములు, ప్రధాన కార్యదర్శి ఎం. లక్ష్మి నారాయణ తీవ్రంగా ఖండించారు. ప్రసారమైన వార్తకు తనకు ఎలాంటి సంబంధం లేకపోయినా అరెస్ట్ చేశారంటూ సుధీర్ చెప్పిన మాటలు పరిగణలోకి తీసుకోవాలని వారన్నారు. సంబంధంలేని వారిని ఎందుకు అరెస్ట్ చేశారని ప్రశ్నించారు. జర్నలిస్టుల పట్ల పోలీసులు దురుసుగా ప్రవర్తించడం అన్యాయమని అన్నారు. ఆసుపత్రిలో అందరూ చూస్తుండగానే సుధీర్ మెడపై చేతులు వేసి బలవంతంగా తీసుకువెళ్లడం సమంజసం కాదని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ లో కిరణ్ కుమార్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు జీటివి జర్నలిస్టులపై పోలీసులు ప్రవర్తించినట్టే ఇప్పుడు తెలంగాణ పోలీసులు కూడా అదే తరహాలో వ్యవహరిస్తున్నారని వారన్నారు. మీడియాలో ఒక మంత్రి, మహిళా ఐఏఎస్ అధికారి మనోభావాలు దెబ్బతినే విధంగా ప్రసారం చేసిన కథనంలో ఎవరి భాస్వామ్యం ఉందొ వారిని ఖచ్చితంగా శిక్షించాలని , అయితే సంబంధం లేని జర్నలిస్టులను అరెస్ట్ చెయ్యడం ఎంతవరకు సమంజసమని అన్నారు. అయితే మీడియా కూడా ఒక కథనం ప్రచురించే ముందు ఆ కథానానికి ఉన్న వాస్తవికతను, తరువాత జరుగబోయే పరిణామాలను ఆలోచించాలని, ఒక మహిళా అధికారిపై ఆరోపణలు చేసే ముందు నిజ నిజాలు నిర్ధారించుకోవాల్సిన బాధ్యత మీడియాపై ఉంటుందని వారు గుర్తు చేశారు. వ్యక్తి స్వేచ్ఛకు భాగం కలిగించేలా జర్నలిస్టులు వార్తలు రావడం సబబు కాదని వారు పేర్కొన్నారు. ఈ కేసులో భాగమైన వారిని ఖచ్చితంగా శిక్షించాలని, అయితే సంబంధంలేని జర్నలిస్టులను వేధించడం సరైంది కాదని వారన్నారు.

ANN తెలుగు
మహా పత్రిక
03
గురువారం, హైదరాబాద్ | 15-01-2026
జిల్లా వార్తలు | DISTRICT NEWS
WWW.MAHAADAILY.COM

## మంత్రి జూపల్లి కృష్ణారావును కలిసిన కంది శ్రీనివాస రెడ్డి



**ఆదిలాబాద్ మహా :** ఈ నెల 16న సీయం నిర్మల్ సభ ఏర్పాట్లను పరిశీలించేందుకు వచ్చిన రాష్ట్ర ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్, పర్యాటక శాఖ ఉమ్మడి జిల్లా ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావును ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి బుధవారం నిర్మల్ లో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు.ఆదిలాబాద్ నియోజక వర్గ విషయాలతో పాటు సీయం ఆదిలాబాద్ నిర్మల్ జిల్లా పర్యటన విషయాలు జనసమీకరణపై చర్చించారు.ముఖ్యమంత్రి పర్యటన విజయవంతమయ్యేలా దిశానిర్దేశం చేసారు.

## త్వరగా కోలుకోవాలి-కంది శ్రీనివాస రెడ్డి



**ఆదిలాబాద్ మహా:** బాధలో దుఖంలో ఉన్న కుటుంబాలకు ధైర్యం చెబుతూ అండగా నిలబడతారు ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి.ఆప్తులను కుటుంబ సభ్యులను కోల్పోయి పుట్టెడు దుఖంలో ఉన్న కుటుంబాలకు , అనారోగ్యంతో బాధపడుతున్న వారి చెంతకు వెళ్లి పరామర్శించి నేనున్నానంటూ కొండంత భరోసా కల్పిస్తారు. ఆదిలాబాద్ పట్టణలోని ప్రైవేట్ హాస్పిటల్లో అనారోగ్యంతో చికిత్స పొందుతున్నఆదిలాబాద్ రూరల్ మండలం చాందా (టీ) గ్రామానికి చెందిన బొజ్జ వెంకటేష్ ను , గుండె జబ్బుతో బాధపడుతున్నపట్టణంలోని దస్నాపూర్ కాలనీ కి చెందిన ప్రజ్ఞా కుమార్ ను అతని నివాసానికి వెళ్లి పరామర్శించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.కంది శ్రీనివాసరెడ్డి వెంట కొండ గంగాధర్ , బండారి సతీష్ ,సంజయ్, సాహెబ్ రావు, మానె శంకర్ , తమ్మల చందు తదితరులున్నారు..

## రాష్ట్ర అభివృద్ధి – ప్రజల సంక్షేమమే ధ్యేయం

### రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనుల శాఖ మంత్రి గడ్డం వివేక్

**మంచిర్యాల, మహా :** తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి - ప్రజల సంక్షేమమే ధ్యేయమని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు & భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద అన్నారు. బుధవారం క్యాతన పల్లి మున్సిపల్ పరిధిలో పలు అభివృద్ధి పనులకు జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, క్యాతనపల్లి మున్సిపల్ కమిషనర్ రాజు లతో కలిసి మంత్రి శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రభుత్వం సమర్థవంతంగా అమలు చేస్తోందని తెలిపారు. క్యాతన పల్లి మున్సిపల్ పరిధిలోని వార్డులలో ప్రజలకు ప్రమాదకరంగా మారిన విద్యుత్ స్తంభాలు, విద్యుత్ తీగలు, ట్రాన్స్ఫర్మర్లు నివాసాలకు దూరంగా మార్చేందుకు త్వరలోనే చర్యలు చేపడతామని ఆయన తెలిపారు. అమృత్ పథకం కింద క్యాతనపల్లి మున్సిపాలిటీకి రూ.40 కోట్లు మంజూరు చేయగా, ఇప్పటివరకు సుమారు 50 శాతం పనులు పూర్తయ్యాయని, మిగిలిన పనులు పూర్తి చేసి ప్రతి ఇంటికి నల్లా కనెక్షన్ ద్వారా శుద్ధమైన త్రాగునీటిని అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యులు, సిబ్బంది సంఖ్యను పెంచి ప్రజలకు వేగవంతమైన, మెరుగైన వైద్య సేవలు అందించనున్నట్లు తెలిపారు. గత 10 సంవత్సరాలుగా అందని రేషన్ కార్డులను అర్హులైన పేదలకు గుర్తించి అందించామని, ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా ప్రతినెల సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని తెలిపారు. అలాగే, వచ్చే నెల నుంచి అర్హులైన లబ్ధిదారులకు పెన్షన్లు అందించేలా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. క్యాతనపల్లి మున్సిపాలిటీకి రూ.15 కోట్ల నగరాభివృద్ధి నిధులు మంజూరు చేసి అభివృద్ధి పనులు చేపడుతున్నామని, డీఎంఎఫ్టి, సీఎస్ఆర్ నిధులను కూడా ప్రజా ప్రయోజనాలకు వినియోగిస్తామని తెలిపారు. 6వ వార్డు భగత్ సింగ్ నగర్‌లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల వద్ద 87.58 లక్షల రూపాయలు, 21వ వార్డు జెండా సమీపంలోని మెయిన్ రోడ్డులో రూ.20 లక్షలు, 17వ వార్డు రాజీవ్ చౌక్ వద్ద రూ.50 లక్షలు, 20వ వార్డు శ్రీనివాస నగర్ - ప్రగతి నగర్ జంక్షన్ వద్ద 38 లక్షల రూపాయలతో అంతర్గత రహదారులు, మురుగు కాలువల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.

# హెల్మెట్ ఉంటేనే పెట్రోల్ పోయాలి!

- రోడ్డుపైకి నో హెల్మెంట్ నో ఎంట్రీ
- ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాల్సిందే
- చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** చేవెళ్ల నియోజకవర్గం పరిధిలోని పెట్రోల్ బంకుల యాజమాన్యానికి ఎమ్మెల్యే హెచ్చరిక జారీ చేశారు. ద్విచక్ర వాహనాలపై వచ్చిన వారికి హెల్మెంట్ ఉంటేనే పెట్రోల్ పోయాలని సూచించారు. రంగారెడ్డి జిల్లా, శంకర్పల్లి మున్సిపల్ పరిధిలోని ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ పరిధిలోని, శంకర్ పల్లి పోలీసుల ఆధ్వర్యంలో "ఎరైవ్ ఎలైవ్" అని నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా శంకర్ పల్లి వాహనదారులకు, పోలీసులకు 100 హెల్మెట్లను అందజేస్తా అని ఎమ్మెల్యే చెప్పారు.. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి వారు మాట్లాడుతూ... ట్రాఫిక్ నిబంధనలు ప్రతి ఒక్క మానవుడు పాటించాల్సిందేనని, ముఖ్యంగా చిన్నపిల్లలకు వాహనాలు ఇవ్వడం నేరమని చెప్పారు. 18 సంవత్సరాలు నిండిన తర్వాత లైసెన్స్ తెచ్చుకొని రోడ్డుపైన వాహనం నడపాలని ప్రజలకు సూచించారు. పోలీస్ రూల్స్ కు ఎవరు కూడా వ్యతిరేకించకుండా వారికి సహకరించి ట్రాఫిక్కు నిబంధనలను పాటించాలని కోరారు. అనంతరం రైతులతో మాట్లాడి ఉల్లికి గిట్టుబాటు ధర ఉందా లేదా అని అడిగి తెలుసుకున్నారు. రైతులకు శంకర్పల్లి మార్కెట్ ఎప్పటికీ అందుబాటులో ఉంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలోని ప్రజాప్రతినిధులు పార్టీ నాయకులు పోలీస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు..





## అంగరంగ వైభవంగా గోదా రంగనాథుల కళ్యాణం...

**రాజేంద్రనగర్, మహా ;** శంషాబాద్ మండలం ముచ్చింతల్ లోని శ్రీరామ నగర్ సమతా మూర్తి ప్రాంగణంలో చిన్న జీయర్ స్వామి పర్యవేక్షణలో శ్రీ గోదా రంగనాథుల కళ్యాణం అంగరంగ వైభవంగా కనుల పండుగ బుధవారం జరిగింది. సమతా మూర్తి ప్రాంగణంలో నిర్వహించిన కళ్యాణోత్సవంలో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. ముచ్చింతల్ శ్రీరామ నగరంలో సమతా మూర్తి ప్రాంగణంలో శ్రీ త్రిదండి రామానుజ శ్రీ చిన్న జీయర్ స్వామి ఆధ్వర్యంలో వేదమంత్రాలు మంగళ వాయిద్యాల నడుమ శ్రీ గోదాదేవి- శ్రీ రంగనాథ స్వామి దివ్య కళ్యాణం వైభవంగాసాగింది. అందరికీ యోగక్షేమాలు కలగాలని శ్రీ చిన్న జీయర్ స్వామి మంగళ శాసనాలతో కూడిన దీవెనలు అందించారు. జనవరి 30 నుంచి ఫిబ్రవరి 9 వరకు 11 రోజులపాటు సమతా కుంబ్ 2026 నిర్వహించనున్నట్లు తెలిపారు. కళ్యాణ వేడుకల్లో మై హోమ్ అధినేత రామేశ్వరరావు దంపతులు తదితరులు పాల్గొన్నారు.



## టీడీఏ క్యాలెండర్ ఆవిష్కరించిన మంత్రి

**ఆదిలాబాద్ మహా :** తెలంగాణ డయాగ్నస్టిక్స్ అసోసియేషన్ క్యాలెండర్ ని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆవిష్కరించారు. బంజారా హిల్స్ లోని మంత్రుల నివాస గృహంలో ఆయనను టీడీఏ నాయకులు కలిసి తమ సంస్థ కార్యకాలపాలను రాష్ట్ర అధ్యక్షులు మట్టిపల్లి రమేష్ మంత్రికి వివరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ డయాగ్నస్టిక్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేరెళ్ల హనుమంతు, తిరుపతి, పృధ్వి నాయక్, సత్యం, క్రాంతి కుమార్, ఆంజనేయులు,శ్రీనివాస్,నర్సింలు, రమేష్,రాజలింగం , వివిధ జిల్లాల టీడీఏ ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఈనెల 22న విద్యాసంస్థలకు సెలవు

### కలెక్టర్ రాజర్షి షా

**ఆదిలాబాద్ మహా:** ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్ గ్రామంలో నిర్వహించే చారిత్రాత్మక నాగోబా జాతర ప్రజా దర్బార్‌ను పురస్కరించుకుని, ఈనెల 22 గురువారం రోజున జిల్లాలోని అన్ని విద్యాసంస్థలకు స్థానిక సెలవు ప్రకటిస్తూ జిల్లా కలెక్టర్ రాజర్షి షా బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆదివాసీల ఆరాధ్యదైవం, ఆసియాలోనే రెండవ అతిపెద్ద గిరిజన జాతర సందర్భంగా,మెస్రం వంశీయుల విజ్ఞప్తి మేరకు, జాతర విశిష్టతను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు కలెక్టర్ తెలిపారు.జనవరి 22న జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్, డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాలలకు సెలవు ఉంటుందనీ, ఈ సెలవుకు బదులుగా మార్చి 14 రెండవ శనివారం రోజున జిల్లాలోని అన్ని విద్యాసంస్థలు పని చేయాల్సి ఉంటుందని సూచించారు.

## 19న ఉచిత కంటి వైద్య శిబిరం

**ఆమనగల్లు, మహా:** లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్లు వారి ఆధ్వర్యంలో ఈ నెల 19న ఆమనగల్లు పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి ఎదురుగా ఉన్న రాంరెడ్డి లయన్ ఐ హాస్పిటల్ విజన్ సెంటర్లో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు లయన్స్ క్లబ్ పి ఆర్ ఓ ఎం ఏ పాష తెలిపారు. ఆమనగల్లు మండల పరిసర గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిఆర్ఓ పాషా తెలిపారు. కంటిచూపు మందగించిన వారు తమ గుర్తింపు కార్డులైన ఆధార్ లేదా రేషన్ కార్డు తమ వెంట తెచ్చుకోవాలని ఆయన కోరారు.



## ఘనంగా భోగి పండుగ

**ఆమనగల్లు, మహా :** పాడి పంటలు సమృద్ధిగా పండి రైతులు, ప్రజలు సంతోషంగా ఉండాలని, సంక్రాంతి పండుగను ప్రజలు సంతోషంగా జరుపుకోవాలని టిపిసిసి సభ్యులు ఆయిళ్ల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. సంక్రాంతి సందర్భంగా తొలి పండగ భోగిని బుధవారం ప్రజలు ఘనంగా నిర్వహించుకున్నారు. తెల్లవారుజామున నిద్ర లేచి, స్నానాలు ఆచరించి, భోగి మంటలు వేశారు. చిన్నా, పెద్ద అన్న తేడా లేకుండా అందరూ ఈ వేడుకల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ బోగి పండుగ సకల భోగ భాగ్యాలు, సుఖ సంతోషాలను ప్రజలకు అందించాలని కోరారు.

విశ్వాస సూపర్ స్పెషాలిటి హాస్పిటల్ & డయాలసిస్ సెంటర్
RRR ఆర్కేడ్, విజయటాకీస్ రోడ్, హన్మకొండ.



- ఇప్పుడు మా హాస్పిటల్ యందు కిడ్నీ సంబంధిత వ్యాధులకు ఆరోగ్యశ్రీ సౌకర్యం కలదు.
- డయాలసీస్ పేషంట్లకు ఆరోగ్య శ్రీ, ఎంప్లాయింట్‌మెంట్ హెల్త్ స్కీం సౌకర్యం కలదు.
- ప్రభుత్వ ఉద్యోగులకు మెడికల్ రీ-ఎంబర్స్‌మెంట్ సౌకర్యం కలదు.
- గవర్నమెంట్ ఉద్యోగులకు EHS సౌకర్యం కలదు.
- అన్ని రకముల ఇన్సూరెన్సుల సౌకర్యం కలదు.

డా|| రమేష్ దాసరోజు
MD, DM (న్యూరాలజి)
న్యూరో ఫిజిషియన్
ఫిట్స్, పక్షవాతం, మతిమరుపు, మెదడు, వెన్నుపూస, నరముల స్పెషలిస్ట్

డా|| ప్రవీణ్ రెడ్డి పరుపాటి
MD, DM (నెఫ్రాలజి)
నెఫ్రాలజిస్ట్ / కిడ్నీ స్పెషలిస్ట్
నెఫ్రోటిక్ సిండ్రోమ్, కిడ్నీలో రాళ్ళు, బి.పి., షుగరు వలన వచ్చు కిడ్నీ వ్యాధుల నిపుణులు

డా|| రోజా పరుపాటి
MD, DGO
గైనకాలజిస్ట్, ఇన్‌ఫెర్టిలిటి స్పెషలిస్ట్ & లాప్రోస్కోపిక్ (స్త్రీల వ్యాధుల నిపుణులు)

డా|| రాజ్‌కుమార్. P
MBBS, DNB (Internal Medicine)
జనరల్ ఫిజిషియన్, డయబెటాలజిస్ట్ & క్రిటికల్ కేర్ ఫిజీషియన్

డా|| ముక్క గోపినాథ్
MS, PDCC
సర్జికల్ గ్యాస్ట్రో ఎంటారాలజిస్ట్
అడ్వాన్స్‌డ్ లాప్రోస్కోపిక్, బెరియాట్రిక్ సర్జన్

డా|| యన్. సురేందర్ రెడ్డి
MS, M.Ch. (Urology)
యురాలజి సర్జన్
మూత్రపిండాల వైద్య నిపుణులు

డా|| శ్యామ్ సుందర్ రెడ్డి. P
MD.,DM
కార్డియాలజిస్ట్ (KIMS, Hyd.)
(ప్రతి బుధవారం)

మా ప్రత్యేకతలు : ★ 80 పడకల హాస్పిటల్ ★ అపరేషన్ థియేటర్
★ల్యాబ్ / ఎక్స్‌రే / అల్ట్రా సౌండ్ ★ ICU / AMC / వెంటిలేటర్
★ EEG / NCS / 2D ECHO ★ 24 గంటల డయాలసిస్ సౌకర్యం కలదు
అపాయింట్‌మెంట్ కొరకు : 9849779692, 7674990104



# సంబరాల.. సంక్రాంతి

## వెలుగులు తెచ్చే పండుగ

**మహా, ప్రత్యేకం:** సూర్యభగవానుడు మకరరాశిలోకి ప్రవేశించే రోజే సంక్రాంతి. దక్షిణాయనం పూర్తయి ఉత్తరాయణ పుణ్యకాలం ప్రవేశించే సమయం కనుక 'ఉత్తర క్రాంతి' అని కూడా పిలుస్తారు. సూర్యుడు ఒక్కో నెలలో ఒక్కో రాశిలోకి ప్రవేశిస్తాడు. అలా ఏడాదికి పన్నెండు సంక్రాంతులొస్తాయి. కానీ మకర సంక్రమణం నుంచి భాస్కరుడు ప్రచండ తేజస్సుతో ప్రకాశిస్తాడు.

## సంక్రాంతి అంటే..

ముగ్గులు, గొబ్బెమ్మలు, బసవన్నలు, హరిదాసులు, కోడిపందేలు, భోగిమంటలతో శోభాయమానమైన సంక్రాంతి సంబరాల గురించి ఎంత చెప్పినా తక్కువే. చెరుకుగడలు, కోలాటాలు, బొమ్మల కొలువులు ఇవన్నీ మన తెలుగువారికే సొంతం.

## 2080 దాకా జనవరి 15

తెలుగు రాష్ట్రాలకు పెద్ద పండగ అంటే సంక్రాంతి. దేశవ్యాప్తంగా కూడా మకర సంక్రాంతిని జరుపుకుంటారు. దేశంలోని పలు ప్రాంతాలలో పొంగల్, లోహ్రీ, మాఘ బిహు, కిచ్డి వంటి వివిధ పేర్లతో పండుగ చేసుకుంటారు. సూర్యుడు మకర రాశిలోకి ప్రవేశించే సందర్భంలో ఈ పండుగను సెలబ్రేట్ చేసుకుంటారు. మకర సంక్రాంతి సౌర చక్రం ఆధారంగా ఉంటుంది. అందువల్ల, ఇది దాదాపు ప్రతి సంవత్సరం ఒకే తేదీన వస్తుంది. అయితే ఇటీవలి కాలంలో సంక్రాంతి పండుగ తేదీ మారింది. చాలా సంవత్సరాల పాటు జనవరి 14వ తేదీనే సంక్రాంతిని జరుపుకునే వాళ్లం. అయితే 2008 నుంచి మాత్రం జనవరి 15వ తేదీన సంక్రాంతిని సెలబ్రేట్ చేసుకుంటున్నాం. దీని వెనుక ఓ ఆసక్తికర కారణం ఉందట. భూమి సూర్యుని చుట్టూ తిరిగే కక్ష్యలో వచ్చిన చిన్న మార్పు వల్లే సంక్రాంతి పండుగ జనవరి 14 నుంచి 15కు మారిందట. భూమి తన కక్ష్యలో తిరుగుతూ స్వల్పంగా దిశ మార్చుకోవడం వల్ల, సూర్యుడు మకర రాశిలోకి ప్రవేశించే సమయం కొద్దిగా మారుతుంది. ప్రతి సంవత్సరం ఈ మార్పు సుమారు 20 నిమిషాలు ఉంటుంది. ఈ 20 నిమిషాల తేడా వల్ల, సుమారు 72 సంవత్సరాలకు ఒకసారి సంక్రాంతి తేదీ ఒక రోజు తర్వాతకు జరుగుతుంది . అందుకే 1935 నుంచి 2007 వరకు జనవరి 14న ఉన్న సంక్రాంతి, 2008 నుంచి జనవరి 15కి మారింది. ఇలా 2080 సంవత్సరం వరకు జనవరి 15వ తేదీనే సంక్రాంతి వస్తుందట. 2081వ సంవత్సరం నుంచి మాత్రం సంక్రాంతి జనవరి 16కు మారుతుందట.





## సంబరాల సంక్రాంతి

మూడు రోజుల పండుగలో అతి ముఖ్యమైంది సంక్రాంతి. ఉదయాన్నే సూర్యనమస్కారాలతో సంక్రాంతి ప్రారంభమవుతుంది. ఉత్తరాయణ పుణ్యకాలం మొదలయ్యేది, సూర్యుడు మకరరాశిలోకి ప్రవేశించేది ఈ రోజే. పంటలు ఇళ్లకు చేరే పర్వదినం కనుక అరిసెలు, పాయసం మొదలైన వంటలతో వేడుక చేస్తారు. ఈ రోజు స్త్రీలు గౌరీదేవికి కుంకుమ, పసుపు సమర్పించి పూజిస్తారు. ముత్తయిదువులకు పూలూపండ్లను వాయనంగా ఇస్తారు. సంక్రాంతి ముగ్గుల పండుగ. రంగురంగుల రంగవల్లులతో లోగిళ్లు కళకళలాడతాయి. గీతలతో, చుక్కలతో తీరు తీరుగా రూపు దిద్దుకుంటాయి. మధ్యచుక్క సూర్యుడి ప్రతిరూపంగా, చుట్టూ ఉన్నవి గ్రహాలకు ప్రతీకలుగా భావిస్తారు. సంక్రాంతికి సంబంధించిన విషయాలన్నీ సూర్యుడితో ముడిపడి ఉంటాయి. ముగ్గులు వేసే సరదా, సందడి, శారీరక శ్రమ వెనుక నలుగురితో కలిసే స్నేహానుబంధం, ఆరోగ్య రహస్యం అంతర్లీనంగా కనిపిస్తాయి. పండుగలో గొబ్బెమ్మలదీ ముఖ్య పాత్రే. ఈ కాలంలో కీటకాల ద్వారా వ్యాపించే రోగాలు గొబ్బెమ్మల వల్ల నయమవుతాయి.

## కనుమ.. పశువుల పండుగ

సంక్రాంతి మరుసటి రోజు కనుమ. ఇది పశువులను పూజించే పర్వదినం. రైతులు ఉదయాన్నే లేచి పశువుల పాకను, పశువులను శుభ్రంచేస్తారు. కుంకుమ బొట్లు అద్దుతారు. పూలహారాలు వేసి పూజిస్తారు. వండిన పొంగలిని భగవంతునికి నివేదించి, కొంత పశువులకు తినిపించి, మిగిలినదాన్ని పొలాల్లో జల్లుతారు. ఈ ప్రసాదంతో పంటలు బాగా పండుతాయని నమ్ముతారు. పశువుల శ్రమతోనే పంట తమ చేతికి అందుతోందన్న కృతజ్ఞతా సూచకంగా వాటిని పూజించి, గౌరవించడం ఆనవాయితీ. అలంకరించిన గంగిరెద్దులను వీధుల్లో ఊరేగిస్తారు. పశువులతో పాటు నాగలికీ పూజ చేస్తారు. 'కనుమ నాడు కాకి కూడా కదలదు' అన్న నానుడి తెలిసిందే కదా! అందుకే ఆరోజు ఏ పనికీ వెళ్లరు, ప్రయాణం కూడా చేయరు. 'కనుమ నాడు మినుము కొరకవలె' అన్న లోకోక్తి ప్రకారం గారెలు తింటారు. మూడు రోజులు ఆనందోత్సాహాలతో చేసుకునే సంక్రాంతి బంధాలను బలపరుస్తుంది. ప్రకృతి సౌందర్యాన్ని ఆవిష్కరిస్తుంది.

## నేటి నుండి జహంగీర్ పీర్ దర్గా ఉర్సు ఉత్సవాలు

### హాజరు కానున్న ప్రజాప్రతినిధులు, జర్నలిస్టులు



**షాద్ నగర్. మహా:** హజ్రత్ జహంగీర్ పీర్ దర్గా మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తోంది. ఆధ్యాత్మికతతో పాటు ఆహ్లాదాన్ని పంచుతోంది. సాధారణ రోజుల్లోనే కాకుండా ఏడాదికోసారి నిర్వహించే ఉర్సుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి బాబాను దర్శించుకుంటారు. ఇక్కడే వంటావార్పు చేసి బాబాకు నైవేద్యాలను సమర్పిస్తారు. రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గం కొత్తూరు మండలం జహంగీర్ పీర్ దర్గా ప్రతి సంవత్సరం జరిగే ఉర్సు ఉత్సవాలు గురువారం ప్రారంభం కానున్నాయి. ఉత్సవాలు 3 రోజుల పాటు వైభవంగా కొనసాగనున్నాయి. చుట్టుపక్కల ప్రాంతాలతో పాటు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నలుమూలల నుంచి హిందూ, ముస్లింలు వేడుకలకు హాజరు కానున్నారు. ఇందుకు ఉర్సు ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ముమ్మర ఏర్పాట్లు చేశారు. దర్గాను ప్రత్యేక అలంకరణతో ముస్తాబు చేశారు. ఉర్సు ఉత్సవాలు .. ఈ నెల 15,16,17న ప్రారంభమయ్యే ఉర్సు ఉత్సవాలు అధికారికంగా 3 రోజులు కొనసాగినప్పటికీ ఉర్సు సందడి కొనసాగనుంది. గురువారం 15 తేది రోజు జహంగీర్ పీర్ దర్గా లో మసీదులో ప్రత్యేక ప్రార్ధన చేసి సాయంత్రం 5.30 ని.లకు గంధం ఊరేగింపు ప్రారంభిస్తారు. 16 వ తేదీన దర్గా వద్ద దీపాల వెలిగింపు కార్యక్రమం. 17 వ తేది రోజు రాత్రి ముస్లిం మత గురువులు ఖురాన్ సందేశాన్ని వినిపిస్తారు.



## రేగడి చిలుకమర్రి గ్రామంలో సీపీఎల్ - 4 క్రికెట్ టోర్నమెంటు ప్రారంభోత్సవం

**షాద్ నగర్. మహా:** షాద్ నగర్ నియోజకవర్గం ఫరూక్ నగర్ మండలం రేగడి చిలుకమర్రి గ్రామంలో సీ.పీ.ఎల్ 4 క్రికెట్ టోర్నమెంటు సర్పంచ్ ఏనుబోతుల శ్వేత శివారెడ్డి, ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డిప్యూ టీ సర్పంచ్ జమాల్పూర్ నందులాల్, వార్డ్ మెంబర్స్ ఎం.కుమార్, బి.మల్లారెడ్డి, ఎన్. కిరణ్ కుమార్ రెడ్డి, ఎం. నందిని రాకేష్, పి. స్వప్న రమేష్, బి. లక్ష్మీ రాములు. గ్రామపెద్దలు, మాజీ సర్పంచ్, ఎం. బుచ్చయ్య, మాజీ డిప్యూటీ సర్పంచ్, ఎన్. బుగ్గ రాములు, ఎన్. బాలయ్యా, బి. హరీశ్వర్ రెడ్డి, కె. నరసింహారెడ్డి, జి. వెంకట్ రెడ్డి, జి. ప్రవీణ్, ఎడ్ల రవి, నాలుగు జట్ల కెప్టెన్లు, జి. నవీన్, పి. రాజు, ఎం. రాకేశ్, ఎన్. కృష్ణా రెడ్డి, గ్రామ పేదలు, యువకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమనికి మొదటి బహుమతి: 20000, గ్రామ సర్పంచ్ ఏనుబోతుల శ్వేత శివారెడ్డి అందిస్తున్నారు. రెండవ బహుమతి :10000, రెండో బహుమతి గ్రామ డిప్యూటీ సర్పంచ్ జమాల్పూర్ నందులాల్.

**టీ షర్ట్ స్పాన్సర్స్**

ఎడ్ల రవి, ఎన్. కృష్ణారెడ్డి టీం, మల్లారెడ్డిగూడెం బుచ్చయ్య, రాకేశ్ టీం. పుడుగుర్తి రమేష్, రాజు టీం. గోనె వీరేందర్ రెడ్డి, నవీన్ టీం. క్రికెట్ గ్రౌండ్ స్పాన్సర్ చింతకింది విట్టల్ రెడ్డి. టెంట్ హౌస్ స్పాన్సర్ బొబ్బిని మహేందర్. వాటర్ బాటిల్స్ స్పాన్సర్, బుర్రగంజి రాములు. వికెట్స్ అండ్ బాల్స్ స్పాన్సర్, గడ్డమీది లక్ష్మయ్య. గ్రౌండ్ వర్క్ మన్క కుమార్, బుచ్చమ్మ హరీశ్వర్ రెడ్డి. బుచ్చమ్మ మల్లారెడ్డి, పొన్న శేఖర్ రెడ్డి, ఎం. జంగయ్య, జమాల్పూర్ బంధులాల్. తదితరులు అందిస్తున్నారు

## అంతర్ రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు చేసిన పోలీసులు

### 15 తులాల బంగారు నగలు,5.5 తులాల వెండి నగలు స్వాధీనం.. సిసిఎస్, కేయుసి పోలీసులను అభినందించిన వరంగల్ సీపీ





**వరంగల్ హన్మకొండ మహా;** పట్ట పగలు దొంగతనాలు చేసే పశ్చిమ బెంగాల్ కు చెందిన అంతర్ రాష్ట్ర దొంగల ముఠా లోని ముగ్గురు నిందితులను సిసిఎస్, కేయుసి పోలీసులు సంయుక్తంగా అరెస్ట్ చేయగా మరో నిందితుడు ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నిందితుల నుంచి 15 తులాల బంగారు నగలు 5.5 తులాల వెండి నగలను మొత్తం విలువ దాదాపు రూ.16 లక్షలు రూపాయల సొత్తును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

**అరెస్టు చేయబడిన నిందితుల వివరాలు**

మొదటి నిందితుడు పేరు ఫెరోజ్ షేక్, తండ్రి పేరు లాలూ షేక్, వయస్సు 37 సం లు, కులం ముస్లిం, పేరు సుక్ చంద్ తండ్రి పేరు జాఫర్ షేక్, వయసు 33 సంలు, కులం ముస్లిం, మూడో నిందితుడి పేరు యామీన్, తండ్రి పేరు సలీం షేక్, వయసు 36 సంలు, కులం ముస్లిం, వీరందరి నివాసము ముజ్ పార గ్రామం, బేలదంగా తాలూకా, ముర్షిదాబాద్ జిల్లా, పశ్చిమ బెంగాల్ రాష్ట్రం చెందిన వారుగా పోలీసులు గుర్తించడం జరిగింది. పరారీలో ఉన్న ప్రస్తుతం ఫెరోజ్ షేక్ అనే మరో నిందితుడు పరారీ వున్నట్లు పోలీసులు తెలిపారు. దొంగతనాలు ఎంచుకున్న తీరు నిందితులు మద్యం, హెరాయిన్, మత్తు పదార్థాలకు అలవాటు పడి వారి జల్సాల కోసం సులువుగా డబ్బులు సంపాదించడానికి పట్ట పగలే ఇండ్ల తాళాలు పగల గొట్టి బంగారు, వెండి నగలు దొంగలించి వాటిని అమ్ముకొని జల్సాలు తీర్చుకొంటు జీవనం కొనసాగిస్తారు. నిందితులు గతంలోనూ పశ్చిమ బెంగాల్ రాష్ట్రం. ముజ్ పార గ్రామం, బేలదంగా తాలూకా, ముర్షిదాబాద్ జిల్లా. గతంలో వీరు పశ్చిమ బెంగాల్, రాజస్థాన్, ఆంధ్రా, ఒడిస్సా, మహారాష్ట్రలలో దొంగతనాలకు పాల్పడగా పచ్చిమబెంగాల్, ఆంధ్రా, మహారాష్ట్ర పోలీసులు అరెస్ట్ చేసి జైలు కు పంపించడం జరిగింది. జైల్ లో ఉండి బయటకు వచ్చిన తర్వాత నిందితులు ఒక ముఠాగా ఏర్పడి తెలంగాణ లో దొంగతనాలు చేయాలని పథకం వేసుకొని వారి పథకం ప్రకారం నిందితులు పశ్చిమబెంగాల్ రాష్ట్రం నుండి హన్మకొండ కు వచ్చి 2025 డిసెంబర్ 17 తేదీన హన్మకొండ లోని కేయూసీ పోలీస్ స్టేషన్ పరిధి లోని పరిమళ కాలనీ, సప్తగిరి కాలనీ లలో రెండు ఇండ్లలో తాళాలు పగలగొట్టి బంగారు, వెండి నగలు నగదును దొంగిలించి పారి పోయారు. మరల డిసెంబర్ చివరలో హన్మకొండ కు వచ్చి దొంగతనాలు చేయ డానికి ప్రయత్నించే క్రమంలో అవకాశం దొరకక తిరిగి వెళ్ళి పోయారు. మరల హన్మకొండ కు వచ్చి తేదీ 10.01.2026 మధ్యాహ్నం హన్మకొండ గోపాలపురం, శివ సాయి కాలనీ లో ఉదయం ఒక ఇంటి తాళం పగలగొట్టి ఇంట్లోని బీరువా లో గల సుమారు 15 తులాల బంగారు నగలు, 5 తులాల వెండి నగలు, కొంత నగదును దొంగిలించి పోలీసులకు దొరికిపోయారు. ఈ విషయంలో వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ఆదేశాల మేరకు, సెంట్రల్ జోన్ డీసీపీ ధారా కవిత పర్యవేక్షణలో అడిషనల్ డీసీపీ క్రైమ్ బాలస్వామీ, ఏసిపి క్రైమ్ పి సదయ్య, ఏసిపి హన్మకొండ పి ప్రశాంత్ రెడ్డి వీరి ఆధ్వర్యంలో స్పెషల్ ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి సాంకేతిక పరిజ్ఞాన సహాయంతో నేరస్థుల వివరాలు సేకరించి వారి ఆచూకీ కోసం ఆరా తీస్తున్న క్రమంలో నిందితులు మళ్ళీ దొంగతనాలు చెయడానికి కేయుసి జంక్షన్ వద్ద ఉన్నారనే పక్క సమాచారం మేరకు కేయుసి, సి ఎస్ పోలీసులు సంయుక్తంగా జంక్షన్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా నిందితులు పోలీసు వారిని చూసి పారిపోతున్న క్రమంలో వారిని పట్టుకుని తమదైన శైలిలో విచారించగా వారు చేసిన దొంగతనాల గురించి ఒప్పుకున్నారు.


పై దొంగతనాలకు పాల్పడిన నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన సిసిఎస్ ఇన్స్పెక్టర్ కె రామకృష్ణ, కేయుసి ఇన్స్పెక్టర్ ఎస్ రవి కుమార్, ఐటి కోర్ టీం ఎండి సల్మాన్ పాషా, ఎస్సైలు రాజ్ కుమార్, సాయి ప్రసన్న కుమార్, శ్రీనివాస రాజు, హెడ్ కానిస్టేబుల్లు మహేశ్వర్, జంపయ్య, కానిస్టేబుల్లు మధుకర్, చంద్రశేఖర్, రాములు, ఉపేందర్, వంశీ, విశ్వేశ్వర్, వినోద్ లను వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ప్రత్యేకంగా అభినందించారు.



## జర్నలిస్టుపై తప్పుడు కేసులు నమోదు చేసి అరెస్టు

### ఖండిస్తూ టీయూడబ్ల్యూజే (ఐజేయు) నాయకుడు జి. శ్రీనివాస్ (పేపర్ శీను)

**షాద్ నగర్. మహా:** సంక్రాంతి పర్వదినాన జర్నలిస్టులను ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా నోటీసులు లేకుండా అదుపులోకి తీసుకోవడం దారుణం.. అది కూడా అర్ధరాత్రి సమయంలో ఎన్నో సందర్భాలలో ప్రజల పక్షాన నిలబడి పోరాడిన ముగ్గురు జర్నలిస్టులను అదుపులోకి తీసుకోవడం శోచనీయం.. నిబంధనల ప్రకారం వ్యవహరిస్తే ఎవరికైనా సరే కానీ ఎలాంటి నోటీసులు లేకుండా సెర్చ్ వారెంట్ లేకుండా వ్యవహరించడం అధికారులకు తగదు. ప్రభుత్వం తక్షణమే స్పందించి విచారణ జరిపించి జర్నలిస్టులకు న్యాయం చేయాలని కోరూతు జి. శ్రీనివాస్ (పేపర్ శీను) టియుడబ్ల్యూజే (ఐజేయు) కన్వీనర్ జర్నలిస్ట్ మాఫిషియల్ వెల్ఫేర్ కమిటీ తెలంగాణ.



## సంక్రాంతి పండుగ ప్రజల జీవితాలలో వెలుగులు నింపాలి

### ఏలే చంద్రశేఖర్ జ్యోతి రెడ్డి, బిజెపి రాష్ట్ర నాయకులు

**వలిగొండ, మహా :** సంక్రాంతి పండుగ ప్రజల జీవితాలలో వెలుగులు నింపాలని బిజెపి రాష్ట్ర నాయకులు ఏలే చంద్రశేఖర్ జ్యోతి రెడ్డి అన్నారు సామాజిక సమైక్యతకు జీవన సంస్కృతికి ప్రతిబింబమైన సంక్రాంతి పండుగ ప్రతి ఒక్కరి జీవితాలలో వెలుగులు నింపాలని దక్షిణాయనాన్ని ముగించుకొని ఉత్తరాయణం లోకి సూర్యుడు ప్రవేశిస్తూ కాలంలో తీసుకువచ్చే మార్పులకు అనుగుణంగా మన జీవితాలలో పాత ఆలోచనలు తుడిచేసి కొత్త ఆలోచనలతో ముందుకు వెళుతూ ఆయురారోగ్యాలతో జీవించాలని మనసారా కోరుతూ ఏలే చంద్రశేఖర్ జ్యోతి రెడ్డి ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు



### ఐనవోలు శ్రీ మల్లికార్జున స్వామిని

## దర్శించుకున్న ఎమ్మెల్సీ

**హన్మకొండ మహా;** హన్మకొండ జిల్లా ఐనవోలు మండలం లోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అయిన ఐనవోలు శ్రీ మల్లికార్జున స్వామి శైవక్షేత్రం లో అంగరంగ వైభవంగా బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నారు. భోగి పర్వదినాన్ని పురస్కరించుకొని బ్రహ్మోత్సవాల్లో బుధవారం మాజీ మంత్రి ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య ఆయన కుమారుడు బస్వరాజు శ్రీమాన్ తో కలిసి స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు వేదమంత్రోచ్చారణల మధ్య స్వామి వారి ఆశీర్వచనాలు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

## భూభారతి పోర్టల్ లో అక్రమాలు



- వలిగొండలో వెలుగు చూసిన రిజిస్ట్రేషన్ల మాయాజాలం
- తక్కువ స్టాంపు డ్యూటీ చూపి ప్రభుత్వ ఆదాయానికి గండి
- ఏడుగురు ఆపరేటర్ల పై కేసులు నమోదు

**వలిగొండ, మహా :** భూభారతి పోర్టల్ ద్వారా జరుగుతున్న భూముల రిజిస్ట్రేషన్ లావాదేవీలో భారీ అక్రమాలు వెలుగుచూశాయి ప్రభుత్వానికి రావలసిన స్టాంపు డ్యూటీని తక్కువగా చూపిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టిన భూభారతి ఆపరేటర్ల పై వలిగొండ తహసిల్దార్ దశరథ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వలిగొండ ఎస్సై యుగంధర్ గౌడ్ కేసులు నమోదు చేశారు వలిగొండ మండలానికి చెందిన భూభారతి ఆపరేటర్లు కలకూరి మధు భువనేష్ బసవరాజు. రాకేష్ రాజు శివ రామకృష్ణ తరుణ్ లపై చర్యలు తీసుకోవాలని తాసిల్దార్ దశరథ స్థానిక ఎస్సై యుగంధర్ గౌడ్ ను పై వారిపై ఫిర్యాదు చేయగా పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు ఎస్సై యుగంధర్ గౌడ్ తెలిపారు

## జర్నలిస్టుల స్వేచ్ఛను హరిస్తున్న ప్రభుత్వాలు

### నోటీసు ఇవ్వకుండానే జర్నలిస్టులను అరెస్ట్ చేస్తారా?.. టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షులు పాడేటి అశోక్



**వరంగల్ మహా;** ప్రభుత్వాలు మారిన పాలకుల తీరు మారడం లేదు. ప్రజలకు ప్రభుత్వాలకు వారధిగా ఉన్న జర్నలిస్టుల పై అణిచివేత ధోరణి అలాగే కొనసాగుతోంది. ఇటీవల ఓ మంత్రి, ఐఏఎస్ వ్యవహార శైలి పై అనేక ఆరోపణ కథనాలు ప్రచార మాధ్యమాలలో జోరుగా ప్రచారం సాగుతోంది. ఈ నేపథ్యంలో ఓ ప్రముఖ ఛానల్ ప్రసారం చేసిన కథనం పై ఎలాంటి నోటీసు, సెర్చ్ వారంట్ , దర్యాప్తు కూడా లేకుండా జర్నలిస్టుల ఇండ్లల్లోకి వెళ్ళి ముగ్గురు జర్నలిస్టులను అరెస్ట్ చేయడాన్ని టీ డబ్ల్యూ జే ఎఫ్ వరంగల్ జిల్లా కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు టీ డబ్ల్యూ జే ఎఫ్ వరంగల్ జిల్లా అధ్యక్షులు పొడేటి అశోక్, కార్యదర్శి చిలువేరు శ్రీకాంత్, జిల్లా కోశాధికారి గాయపు రాజు రెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మచ్చిక వెంకటేశ్వర్లు, ఈర్ల సురేందర్, జాతీయ కౌన్సిల్ సభ్యుడు ఆనంతుల రమేష్, లు బుధవారం ఓ ప్రకటనను విడుదల చేశారు. ఇలాంటి సమాచారం లేకుండా అర్ధరాత్రి జర్నలిస్టుల కుటుంబ సభ్యులు భయాందోళనకు గురయ్యేలా పోలీసులు వ్యవహరించిన తీరు గర్హనీయమని పేర్కొన్నారు. ఈ అరెస్టులను ఖండిస్తూ వర్కింగ్ జర్నలిస్టులను వెంటనే విడుదల చేయాలని, నిష్పక్షపాతంగా దర్యాప్తు జరపాలని పోలీసులను వరంగల్ జిల్లా కమిటీ డిమాండ్ చేశారు. వార్తల ప్రసారంలో అభ్యంతరం ఉంటే ప్రెస్ కౌన్సిల్ కు ఫిర్యాదు చేసే అవకాశం ఉన్నా పట్టించుకోకుండా అధికారం చేతిలో ఉంది కదా అని ఇష్టానుసారం వ్యవహరించడం భావ్యం కాదన్నారు. వార్తల ప్రచురణ, ప్రసారాలకు మీడియా యాజమాన్యాలే బాధ్యత వహించాలని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు.



## పేదల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ధ్యేయం

### ఇందిరమ్మ, సోనియమ్మ, సీఎం, ఎమ్మెల్యే నాగరాజు చిత్రపటాలతో లబ్ధిదారులు గృహప్రవేశం



**హన్మకొండ మహా;** హన్మకొండ నగరం 2వ డివిజన్ పరిధిలోని గుండ్ల సింగారం గ్రామానికి చెందిన శాతరాశి కవిత రాజుకుమార్ గడిపి పూజ శ్రీకాంత్ దంపతులకు ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ప్రభుత్వం నుంచి కేటాయించిన రూ.5 లక్షల ఆర్థిక సహాయంతో తమ ఇంటి నిర్మాణాన్ని పూర్తి చేసుకున్నారు. బుధవారం ఇంటి గృహప్రవేశ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు పాల్గొని ఇందిరమ్మ, సోనియమ్మ, సీఎం రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే నాగరాజు చిత్ర పటాలతో లబ్ధిదారులు గృహ ప్రవేశం చేశారు. అనంతరం వారి కుటుంబానికి వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు శుభాకాంక్షలు తెలిపి వారికి నూతన వస్త్రాలు బహుకరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు, లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీ మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాలు






- పాల్గొన్న మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు
- తాత్కాలిక బస్టాండ్ ను ప్రారంభించిన మంత్రి

**హన్మకొండ మహా;** హన్మకొండ జిల్లా ఐనవోలు మండల కేంద్రంలో ఉన్న ప్రసిద్ధ శైవక్షేత్రం ఐనవోలు శ్రీ మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. భోగి పర్వదినాన్ని పురస్కరించుకొని బ్రహ్మోత్సవాల్లో బుధవారం రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ, అటవీ, పర్యావరణ శాఖల మంత్రి కొండా సురేఖ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు తో కలిసి స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాలకు విచ్చేసిన మంత్రి కొండా సురేఖకు ఆలయ ప్రధాన అర్చకులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికి వేదమంత్రోచ్చారణల మధ్య స్వామి వారి ఆశీర్వచనాలు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం మంత్రి, ఎమ్మెల్యే బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను పరిశీలించి భక్తులకు తాగునీరు, విద్యుత్, పారిశుధ్యం, వైద్య సేవలు, భద్రత వంటి మౌలిక వసతులు సమృద్ధిగా అందుతున్నాయా లేదా అని భక్తులను అడిగి తెలుసుకున్నారు. అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు సమన్వయంతో పనిచేసి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని సూచించారు. అలాగే ఐనవోలు జాతర సందర్భంగా ఏర్పాటు చేసిన తాత్కాలిక బస్టాండ్ ను మంత్రి కొండ సురేఖ, ఎమ్మెల్యే కేఆర్ నాగరాజుతో కలిసి ప్రారంభించి వారు బస్సులో ప్రయాణించారు.

**మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ**

భోగి పర్వదినాన ఐనవోలు శ్రీ మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాల్లో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. వేల సంవత్సరాల చరిత్ర కలిగిన ఐనవోలు ఆలయం భక్తుల విశ్వాసానికి ప్రతీకగా నిలుస్తోందని పేర్కొన్నారు. దేవాలయాల అభివృద్ధి, బ్రహ్మోత్సవాలు, జాతరల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తోందని స్పష్టం చేశారు. బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. స్వామివారి కృపతో రాష్ట్ర ప్రజలందరికీ శాంతి, శ్రేయస్సు, సుభిక్షం కలగాలని ఆకాంక్షించారు.

**ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ**

భోగి పర్వదినం సందర్భంగా బ్రహ్మోత్సవాల్లో పాల్గొనడం అపారమైన ఆధ్యాత్మిక ఆనందాన్ని కలిగించిందన్నారు. ఐనవోలు శ్రీ మల్లికార్జున స్వామి ఆలయం తెలంగాణకే కాక దేశవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన ప్రాచీన శైవక్షేత్రమని తెలిపారు. ఆలయ కమిటీ, దేవాదాయ శాఖ, జిల్లా యంత్రాంగం సమన్వయంతో పనిచేస్తూ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయడం అభినందనీయమన్నారు. భోగి పండుగ పాత కష్టాలను విడిచిపెట్టి కొత్త ఆశలతో ముందుకు సాగాలనే సందేశాన్ని ఇస్తుందన్నారు. స్వామివారి ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలందరికీ ఆరోగ్యం, శాంతి, సుభిక్షం కలగాలని, వర్ధన్నపేట నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందాలని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ టెస్కాబ్ ఛైర్మన్ మార్నేనీ రవీందర్ రావు, ఆలయ కమిటీ ఛైర్మన్ కమ్మగోని ప్రభాకర్ గౌడ్, ఆలయ ఈవో సుధాకర్, కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సమ్మక్క-సారలమ్మ మహా జాతరకు భారీ ఏర్పాట్లు

## తుది దశకు చేరుకున్న ఏర్పాట్లు.. క్షేత్ర స్థాయిలోనే ఉండి దిశానిర్దేశం చేస్తున్న మంత్రి సీతక్క.. చరిత్రలో నిలిచిపోయేలా పనులు



**మహా :** మేడారం సమ్మక్క-సారలమ్మ మహా జాతర-2026కు తెలంగాణ ప్రభుత్వం భారీ స్థాయిలో ఏర్పాట్లు చేపట్టింది. కోట్లాది భక్తులు తల్లుల దర్శనానికి వచ్చే ఈ మహా పర్వంలో ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా పటిష్ట చర్యలు తీసుకుంటోంది. ఈ ఏర్పాట్లన్నిటిపై నిత్యం ప్రత్యక్ష పర్యవేక్షణ చేయడానికి మంత్రి సీతక్క మేడారంలోనే బస చేస్తూ, క్షేత్రస్థాయిలో ప్రతి అంశాన్ని పరిశీలిస్తున్నారు. భక్తుల సౌకర్యం, శీఘ్ర దర్శనం ఆమె ప్రథమ ప్రాధాన్యతగా మారింది. ఈ సారి సుమారు మూడు కోట్ల మంది భక్తులు వస్తారనే అంచనాతో, ఎక్కడా ఇబ్బందులు లేకుండా అన్ని శాఖలు కలిసి సమగ్ర ప్రణాళికతో పని చేసేలా మంత్రి సీతక్క నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. ఈ జాతర కోసం మొత్తం 21 శాఖలకు చెందిన 42,027 మంది అధికారులు, సిబ్బంది మేడారం, పరిసర ప్రాంతాల్లో విధులు నిర్వహించనున్నారు. వీరికి అదనంగా 2 వేల మంది ఆదివాసీ యువత వాలంటీర్లుగా తమ సేవలు అందించనున్నారు. మొబైల్ నెట్ వర్క్ కి ఎలాంటి అంతరాయం కలగకుండా 27 శాశ్వత టవర్లతో పాటు తాత్కాలిక పద్ధతిలో 33 మొబైల్ టవర్లను, 450 వెరీ హై ఫ్రీక్వెన్సీ సెట్లను ఏర్పాటు చేశారు. భక్తుల రద్దీని క్రమబద్ధంగా నియంత్రించేందుకు మేడారం ప్రాంతాన్ని 8 పరిపాలనా జోన్లుగా, 42 సెక్టర్లుగా విభజించారు. ఒక్కో జోన్ కు జిల్లా స్థాయి అధికారి ఇంచార్జ్ గా వ్యవహరిస్తారు. ఒక్కో సెక్టార్ కు మండల స్థాయి అధికారి భాధ్యతలు నిర్వర్తిస్తారు. ఆలయ ప్రాంగణం, గద్దెలు, జంపన్నవాగు, ఆర్టీసీ బస్టాండ్, ఊరట్టం, శివరాం సాగర్, నర్లాపూర్, పడిగాపూర్ వంటి అన్ని కీలక ప్రాంతాల్లో కంట్రోల్ రూములు, మిస్సింగ్ పర్సన్స్ క్యాంపులు, అత్యవసర స్పందన బృందాలు ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. భక్తుల రాకపోకల్లో ఇబ్బందులు రాకుండా మొత్తం 525 చోట్ల రహదారి సమస్యలను గుర్తించి పరిష్కరించారు. జాతరకు ఉపయోగపడే కొత్త రోడ్లు, మరమ్మత్తులు, కల్వర్టులతో రవాణా వ్యవస్థను బలోపేతం చేశారు. వాహనాల రద్దీ తగ్గించేందుకు అటవీ, గిరిజన సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో మొత్తం 1,418 ఎకరాల విస్తీర్ణంలో 42 పార్కింగ్ ప్రాంతాలు సిద్ధం చేశారు. తాగునీటి సమస్య తలెత్తకుండా మిషన్ భగీరథ ద్వారా నిరంతం తాగు నీటి సరఫరా జరిగేలా ఏర్పాట్లు పూర్తి చేశారు. మొత్తం 5,482 తాగు నీటి నల్లాలు ఏర్పాటు చేసి భక్తులకు శుద్ధమైన నీటిని అందిస్తున్నారు. జంపన్నవాగులో పవిత్ర స్నానాలు చేసే భక్తుల కోస 119 డ్రెస్సింగ్ రూములు ఏర్పాటు చేయడంతో పాటు నీటి పరిశుభ్రత కోసం ఎప్పటికప్పుడు క్లోరినేషన్ చేయనున్నారు. 285 బ్లాకుల్లో 5700 టాయిలెట్లను సిద్ధం చేశారు. వీటికి అధనంగా మొబైల్ టాయిలెట్స్ ను అందుబాటులోకి తేనున్నారు. పారిశుధ్య నిర్వహణ కోసం 5 వేల మంది సిబ్బందిని, 150 ట్యాంకర్లు, 100 ట్రాక్టర్లు, 18 స్వీపింగ్ మిషిన్లు, 12 జేసీబీ, 40 స్వచ్ఛ ఆటోలు, 16 దోజర్లను రంగంలోకి దింపారు. జాతర ప్రాంతంలో విద్యుత్ సరఫరా అంతరాయం లేకుండా టీజీఎన్‌పీడీసీఎల్ ద్వారా 196 ట్రాన్స్‌ఫార్మర్లు, 911 విద్యుత్ స్తంభాలు, 65.75 కిలోమీటర్ల విద్యుత్ లైన్లు ఏర్పాటు చేశారు. విద్యుత్ అంతరాయం తలెత్తకుండా 350 మంది సిబ్బందిని నియమించారు. ఆలయాలు, ప్రధాన మార్గాలు, పార్కింగ్ ప్రాంతాల్లో వేల సంఖ్యలో హై పవర్ లైట్లు వెలుగులు పంచుతుండగా, అత్యవసర పరిస్థితుల కోసం 28 డీజిల్ జనరేటర్లు బ్యాకప్‌గా సిద్ధంగా ఉన్నాయి. భక్తులు సులభంగా మేడారానికి చేరుకునేందుకు ఆర్టీసీ ఈసారి 4 వేల బస్సులను వినియోగంలోకి తెచ్చి 51 వేల ట్రిప్పులు నిర్వహిస్తోంది. ప్రత్యేక బస్టాండ్లు, ప్రత్యేక రూట్లతో రవాణా వ్యవస్థను మరింత సమర్థంగా నిర్వహిస్తున్నారు. జాతర కోసం 10441 మంది ఆర్టీసీ సిబ్బంది సేవలందించనున్నారు. గంటకు 15 బస్సులు ప్రయాణించేలా ప్లాన్ చేస్తున్నారు. జాతర సమయంలో ఆరోగ్య సేవల కోసం మొత్తం 5,192 మంది వైద్య సిబ్బందిని నియమించారు. భక్తులకు సేవలందించేందుకు 30 అంబులెన్సులు, 40 బైక్ అంబులెన్సులు, 50 పడకల ప్రధాన ఆసుపత్రి, రోజుకు 30 మెడికల్ క్యాంపులు పనిచేస్తాయి. జంపన్నవాగులో ప్రమాదాలను నివారించేందుకు 210 మంది గజ ఈతగాళ్లు, 12 మంది సింగరేణి రెస్క్యూ సిబ్బంది, 100 ఎస్డీఆర్ఎఫ్ బృందాలు నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నారు. అగ్నిప్రమాదాలను ఎదుర్కొనేందుకు 15 ఫైర్ బ్రిగేడ్ వాహనాలు, 268 మంది ఫైర్ ఫైటర్లు సిద్ధంగా ఉన్నారు. అటవీ శాఖ ద్వారా పార్కింగ్, రోడ్లతో పాటు పర్యావరణ సంరక్షణ చేపడుతుండగా, ఐటీడీఏ ఆధ్వర్యంలో గిరిజనులకు కొబ్బరికాయ, బెల్లం, ఇతర వ్యాపారాల కోసం లైసెన్సులు ఇచ్చి ఉపాధి కల్పిస్తున్నారు. మొత్తంగా మేడారం మహా జాతర-2026ను ప్రపంచ స్థాయిలో నిర్వహించాలనే లక్ష్యంతో, అన్ని శాఖల సమన్వయంతో భక్తులకు త్వరితగతిన తల్లుల దర్శనం, సురక్షితమైన, సౌకర్యవంతమైన వాతావరణాన్ని కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో పనిచేస్తోంది.

### మేడారం మహా జాతర కు భారీ ఏర్పాట్లు ఇలా...

**భక్తుల అంచనా:** సుమారు 3 కోట్లు
**విధుల్లో సిబ్బంది:** 21 శాఖలు, 42,027 మంది
**ఆదివాసీ వాలంటీర్లు:** 2,000 మంది
**పరిపాలనా విభజన:** 8 జోన్లు, 42 సెక్టర్లు

**కమ్యూనికేషన్ – టెక్నాలజీ**
**శాశ్వత మొబైల్ టవర్లు:** 27
**తాత్కాలిక మొబైల్ టవర్లు:** 33
**వీహెచ్ఎఫ్ సెట్లు:** 450

#### రవాణా – పార్కింగ్
**పార్కింగ్ స్థలాలు:** 42
**మొత్తం విస్తీర్ణం:** 1,418 ఎకరాలు
**టీజీఎస్ఆర్టీసీ బస్సులు:** 4,000
**మొత్తం ట్రిప్పులు:** 51,000
**ఆర్టీసీ సిబ్బంది:** 10,441
**తాగునీరు డ్రెస్సింగ్ రూములు**
**తాగునీటి నల్లాలు:** 5,482
**జంపన్నవాగు వద్ద డ్రెస్సింగ్ రూములు:** 119

#### పారిశుధ్యం
**బ్లాకులు:** 285
**టాయిలెట్లు:** 5,700
**పారిశుధ్య సిబ్బంది:** 5,000
**ట్యాంకర్లు:** 150
**ట్రాక్టర్లు:** 100
**స్వీపింగ్ మెషిన్లు:** 18
**జేసీబీలు:** 12
**స్వచ్ఛ ఆటోలు:** 40, **దోజర్లు:** 16
**విద్యుత్ – లైటింగ్**
**ట్రాన్స్‌ఫార్మర్లు:** 196
**విద్యుత్ స్తంభాలు:** 911
**విద్యుత్ లైన్లు:** 65.75 కి.మీ
**విద్యుత్ సిబ్బంది:** 350
**డీజిల్ జనరేటర్లు (బ్యాకప్):** 28

#### వైద్యం
**వైద్య సిబ్బంది:** 5,192
**అంబులెన్సులు:** 30
**బైక్ అంబులెన్సులు:** 40
**ప్రధాన ఆసుపత్రి:** 50 పడకలు
**రోజుకు మెడికల్ క్యాంపులు:** 30

#### జంపన్నవాగు భద్రత
**గజ ఈతగాళ్లు:** 210
**సింగరేణి రెస్క్యూ:** 12
**ఎస్ డీఆర్ఎఫ్ బృందాలు:** 100

#### అగ్నిమాపక సిబ్బంది
**ఫైర్ బ్రిగేడ్ వాహనాలు:** 15
**ఫైర్ ఫైటర్లు:** 268

# జర్నలిస్టుల అరెస్టులపై దుమారం

## సొంత పార్టీపై జగ్గారెడ్డి అహసనం.. అలా చేయడం మంచిది కాదని వ్యాఖ్య

**హైదరాబాద్, మహా :** మహిళా ఐఏఎస్‌ను కించపరిచేలా ఆరోపణలు చేశారని, కథనాలు ప్రచారం చేశారని కొన్ని మీడియా సంస్థలు, యూట్యూబ్ ఛానెళ్లపై హైదరాబాద్ సెంట్రల్ క్రైమ్ స్టేషన్‌లో (సీసీఎస్) కేసు నమోదైంది. అంతేకాకుండా సీఎం రేవంత్ రెడ్డి ఫొటోలు అసభ్యకరంగా సోషల్ మీడియాలో పోస్టులో చేస్తున్నారని కేసు నమోదైంది. ఈ కేసులపై విచారణ చేపట్టడానికి హైదరాబాద్ సీపీ సజ్జనార్ నేతృత్వంలో 8 మందితో కూడిన ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేసింది ప్రభుత్వం. ఈ కేసుల్లో దర్యాప్తు ముమ్మరం చేసిన సిట్ అధికారులు.. మంగళవారం (జనవరి 13) అర్ధరాత్రి పలువురు జర్నలిస్టులను అరెస్ట్ చేశారు. దీంతో తెలంగాణ రాజకీయాల్లో దుమారం చెలరేగింది. ప్రభుత్వం తీరుపై కాంగ్రెస్ సీనియర్ నేత, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అసహనం వ్యక్తం చేశారు.



### అరెస్టులు వెంటనే ఆపండి

జర్నలిస్టుల అరెస్ట్‌ను వెంటనే ఆపాలని సీపీ సజ్జనార్, డీజీపీ శివధర్ రెడ్డికి జగ్గారెడ్డి విజ్ఞప్తి చేశారు. బుధవారం మీడియాతో మాట్లాడిన ఆయన మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి వ్యక్తిత్వాన్ని దెబ్బతీస్తూ మీడియాలో వచ్చిన అసత్య కథనాలను ఇప్పటికే ఖండించినట్లు తెలిపారు. వ్యక్తిగత ప్రతిష్టను దెబ్బతీస్తూ నాయకులు.. అధికారులపై మీడియాలో ఇష్టానుసారంగా కథనాలను ప్రసారం చేయడం మంచి సంప్రదాయం కాదని చెప్పారు. అయితే మీడియా అనుసరించే కొన్ని చర్యలు నాయకులు, అధికారులు సహా ఎవరికైనా ఇబ్బందేనని చెప్పారు. ఇలాంటి వాటిని అందరూ ఖండించాల్సిందేనని అన్నారు. అయితే ఈ కథనాలకు సంబంధించి జర్నలిస్ట్‌లను అర్ధరాత్రి అరెస్ట్ చేయడం మంచిది కాదని జగ్గారెడ్డి చెప్పారు.

### అలా చేస్తే బాగుండేది

అరెస్టులు చేయకుండా.. జర్నలిస్ట్‌లకు నోటీసులు ఇచ్చి వారి వివరణ తీసుకుంటే బాగుండేదని జగ్గారెడ్డి అభిప్రాయపడ్డారు. ఇలా జర్నలిస్ట్‌లను అర్ధరాత్రి అరెస్ట్ చేయడం వల్ల వారు భయాందోళనలకు గురయ్యే అవకాశం ఉందన్నారు. వారి అరెస్ట్ వల్ల రాష్ట్రంలో ఒక యుద్ధ వాతావరణం ఏర్పడే ప్రమాదం ఉందని చెప్పారు. ఇలా జరగడం కాంగ్రెస్ పార్టీకి, ప్రభుత్వానికి మంచిది కాదని అభిప్రాయపడ్డారు. జర్నలిస్ట్‌ల అరెస్ట్‌లను వెంటనే ఆపాలన్న ఆయన ఈ విషయాన్ని సిట్ బృందం, డీజీపీ పరిగణలోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.



# సాగు భూముల రిజిస్ట్రేషన్ ఛార్జీల వ్యవహారం

## బస్వరాజ్ ఒక్కడే రూ.11 కోట్లు కొట్టేశాడు.. లగ్జరీ కార్లు.. థాయ్‌లాండ్ టూర్లతో ఎంజాయ్

**హైదరాబాద్, మహా :** ధరణి పోర్టల్ సాక్షిగా సాగు భూముల రిజిస్ట్రేషన్ ఛార్జీల మళ్లింపు వ్యవహారంలో దిగ్భ్రాంతికర విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఈ భారీ కుంభకోణానికి ప్రధాన సూత్రధారిగా భావిస్తున్న యాదగిరిగుట్టకు చెందిన బస్వరాజ్ అనే వ్యక్తి ప్రభుత్వ ఖజానాకు కన్నం వేసి కోట్ల రూపాయలను కొల్లగొట్టినట్లు విచారణలో తేలింది. జనగామ కేంద్రంగా బయటపడిన ఈ 'డిజిటల్ దోపిడీ' వెనుక ఆధునిక హ్యాకింగ్ సాఫ్ట్‌వేర్ బర్ప్ సూట్ వాడినట్లు అధికారులు గుర్తించారు. ప్రస్తుతం పోలీసుల అదుపులో ఉన్న నిందితుడు బస్వరాజ్.. కేవలం రిజిస్ట్రేషన్ ఛార్జీల మళ్లింపు ద్వారానే ఏకంగా రూ. 11 కోట్లు వెనకేసినట్లు సమాచారం. ఈ అక్రమ సంపాదనతో అతను అత్యంత విలాసవంతమైన జీవితాన్ని గడిపాడు. ఖరీదైన ఫార్చ్యూనర్ కార్లు కొనడమే కాకుండా, పదేపదే థాయ్‌లాండ్ వంటి విదేశీ పర్యటనలు చేస్తూ ఎంజాయ్ చేసేవాడని పోలీసులు గుర్తించారు. ఇతనికి పాండు అనే మరో వ్యక్తి సహకరించినట్లు తెలుస్తోంది. బస్వరాజ్ వద్ద 1,200కు పైగా రిజిస్ట్రేషన్ పత్రాలు లభించడం ఈ దోపిడీ తీవ్రతను అద్దం పడుతోంది. ఈ కుంభకోణంలో 'బర్ప్ సూట్' సాఫ్ట్‌వేర్‌ను నిందితులు అద్భుతంగా వాడుకున్నారు. సాధారణంగా రైతులు రిజిస్ట్రేషన్ ఛార్జీలను నగదు రూపంలో ఆన్‌లైన్ సేవా కేంద్రాల్లో చెల్లిస్తారు. ఉదాహరణకు ఒక రైతు రూ. 15,000 ఛార్జీ ఇస్తే.. నిర్వాహకులు అందులో కేవలం రూ. 150 మాత్రమే బ్యాంకుకు చెల్లించేవారు. అయితే బర్ప్ సూట్ సాఫ్ట్‌వేర్ ద్వారా బ్యాంకింగ్ డేటాను ఇంటర్సెప్ట్ చేసి ప్రభుత్వ రికార్డుల్లో మాత్రం రూ. 15 వేలు జమ అయినట్లు తప్పుడు రశీదులు సృష్టించేవారు. ఇలా ఒక్కో లావాదేవీలో వేల రూపాయలు దోచుకుంటూ ప్రభుత్వ ఖజానాను ఖాళీ చేశారు. ప్రాథమిక విచారణ ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా సుమారు 4,800 లావాదేవీల్లో అక్రమాలు జరిగినట్లు, దీనివల్ల ప్రభుత్వానికి రూ. 52 కోట్ల మేర నష్టం వాటిల్లినట్లు తేలింది. ముఖ్యంగా జనగామ, రంగారెడ్డి, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో ఈ అక్రమాలు తారాస్థాయిలో జరిగాయి. ఈ వ్యవహారం అధికారులకు తెలిసినా బయటకు రాకుండా ఉండేందుకు నిందితులు వారికి భారీగా 'మామూళ్లు' ముట్టజెప్పినట్లు పోలీసుల విచారణలో అంగీకరించినట్లు సమాచారం. ఈ భారీ స్కామ్‌పై ప్రభుత్వం ఇప్పటికే రెవెన్యూ, పోలీస్, రిజిస్ట్రేషన్ విభాగాలతో కూడిన ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసింది. బస్వరాజ్ లాంటి నిందితులు పోర్టల్‌లోని సాంకేతిక లోపాలను ఎలా వాడుకున్నారనే కోణంలో విచారణ ముమ్మరంగా సాగుతోంది.

# నూతన సర్పంచ్‌లకు సమగ్ర శిక్షణ

## ట్రైనింగ్ షెడ్యూల్ ఖరారు చేసిన పంచాయతీ రాజ్ శాఖ

ఈనెల 19 నుంచి వచ్చేనెల 21 వరకు శిక్షణ

గ్రామ పాలనను మరింత పారదర్శకంగా తీర్చిదిద్దే దిశగా శిక్షణా తరగతులు

మంత్రి సీతక్క ఆదేశాలతో టీజీఐఆర్డీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా శిక్షణా తరగతులు

**హైదరాబాద్, మహా :** గ్రామ పాలనను మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా తీర్చిదిద్దే దిశగా తెలంగాణ ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. రాష్ట్రవ్యాప్తంగా నూతనంగా ఎన్నికైన సర్పంచ్‌లకు సమగ్ర శిక్షణా కార్యక్రమాలను నిర్వహించేందుకు పంచాయతీరాజ్ శాఖ ట్రైనింగ్ షెడ్యూల్‌ను ఖరారు చేసింది. మంత్రి సీతక్క ఆదేశాల మేరకు టీజీఐఆర్డీ ఆధ్వర్యంలో ఈ శిక్షణా తరగతులు నిర్వహించనున్నారు. సర్పంచ్‌లకు వారి విధులు, నిధులు, బాధ్యతలు, హక్కులు, అలాగే తెలంగాణ పంచాయతీరాజ్ చట్టంపై లోతైన అవగాహన కల్పించేలా శిక్షణా మాడ్యూల్‌ను రూపొందించారు. పైపైన కాకుండా, ఆచరణలో ఉపయోగపడే విధంగా పక్కా పాఠ్యప్రణాళికతో శిక్షణ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే సర్పంచ్‌ల కోసం ప్రత్యేక స్టడీ మెటీరియల్, కరదీపికను సిద్ధం చేశారు. మొత్తం 12,760 మంది సర్పంచ్‌లకు టీజీఐఆర్డీ ద్వారా అందించనున్నారు. గ్రామాభివృద్ధి, సంక్షేమ పథకాల సమర్థ అమలు, పారదర్శక పరిపాలన లక్ష్యంగా ఈ శిక్షణలు రూపుదిద్దుకున్నాయి. సర్పంచ్‌లు బాధ్యతాయుతంగా పని చేసేలా, గ్రామాల్లో ప్రజలకు మెరుగైన సేవలు అందేలా శిక్షణ కార్యక్రమాలు చేపట్టనున్నారు. జనవరి 19 నుంచి ఫిబ్రవరి 21 వరకు జిల్లాల వారీగా ఈ శిక్షణా తరగతులు జరుగుతాయి. ప్రతి జిల్లాలో 5 బ్యాచ్‌లుగా సర్పంచ్‌లకు శిక్షణ ఇవ్వనుండగా, ఒక్కో బ్యాచ్‌లో కనీసం 50 మంది సర్పంచ్‌లు పాల్గొంటారు. ఒక్కో బ్యాచ్‌కు 5 రోజుల పాటు తరగతులు నిర్వహిస్తారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 12,760 మంది సర్పంచ్‌లకు శిక్షణ ఇవ్వనుండగా, ఒక్కో సర్పంచ్‌కు ఐదు రోజుల పాటు బస, భోజనం, శిక్షణా ఖర్చుల కోసం రూ.5,000 వరకు ప్రభుత్వం వెచ్చించనుంది.

ఈ శిక్షణను సమర్థవంతంగా అందించేందుకు మొత్తం 253 మంది మాస్టర్ ట్రైనర్లను ఎంపిక చేసి, వారికి టీజీఐఆర్డీలో ఇప్పటికే ఓరియంటేషన్ పూర్తి చేశారు. వీరు సర్పంచ్‌లకు ప్రాక్టికల్‌గా ఉపయోగపడే విధంగా, పాలన, అభివృద్ధి, ఆర్థిక నిర్వహణ, ప్రజా సేవ అంశాలపై శిక్షణ అందిస్తారు. సర్పంచ్ శిక్షణా తరగతుల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్లకు పంచాయతీ రాజ్ శాఖ ఆదేశాలు జారీ చేసింది. శిక్షణలో పాల్గొనే సర్పంచ్‌లకు భోజనాలు, వసతి సౌకర్యాలు, శిక్షణా కేంద్రాల్లో అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని కూడా స్పష్టం చేసింది. సర్పంచ్‌లకు సరైన శిక్షణ ఇవ్వడం ద్వారా గ్రామ పంచాయతీలు మరింత బలోపేతం అవుతాయని, పారదర్శకమైన పాలన, సమర్థవంతమైన నిధుల వినియోగం, ప్రజల అవసరాలకు వేగంగా స్పందించే వ్యవస్థ ఏర్పడుతుందని ప్రభుత్వం విశ్వసిస్తోంది. మంత్రి సీతక్క నాయకత్వంలో ఈ శిక్షణా కార్యక్రమం గ్రామ స్వరాజ్యానికి దృఢమైన పునాది వేయనుందని పంచాయతీరాజ్ శాఖ స్పష్టం చేసింది.

## చక్రిపురం శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో
# గోదాదేవి మహా కళ్యాణ్ ఉత్సవం

**కుషాయిగూడ :** కుషాయిగూడ చక్రిపురం కాలనీ శ్రీ వెంకటేశ్వర స్వామి శ్రీదేవి భూదేవి సమేతంగా ఆలయంలో అంగరంగ వైభవంగా గోదాదేవి కల్యాణం ఘనంగా జరిగింది ఆలయ నిర్మాణ కర్త మలుగు ప్రతాపరెడ్డి వారి సతీమణి స్వర్ణలత కుమారులు చక్రధర్ రెడ్డి కుటుంబ సమేతంగా వారితోపాటు భక్తులు భారీ సంఖ్యలో గోదాదేవి కల్యాణోత్సవంలో పాల్గొని రెండు గంటలపాటు వేద ఆశీర్వాదాలు కళ్యాణోత్సవాన్ని ఘనంగా జరిపారు భక్తులు అట్లే కూర్చుండి శ్రీహరి గోవిందా శ్రీహరి గోవిందా నమో నారాయణాయ ఓం నమో భగవతే వాసుదేవాయ ఓం నమో భగవతే మహా సుదర్శనాయ ఓం నమో భగవతే వాసుదేవాయ ధనవంతురియే అంటూ నామ స్మరణలతో గోవింద నామాలతో చక్రిపురం కుషాయిగూడ నాగారం ధమ్మాయిగూడ ఇతర కాలనీలా నుండి అత్యధిక సంఖ్యలో భక్తులు పాల్గొని కళ్యాణోత్సవంలో పాల్గొన్నారు కళ్యాణ్ ఉత్సవం అనంతరం ఆలయ ధర్మకర్తలు ఏర్పాటుచేసిన అన్నదాన ప్రసాదాన్ని స్వీకరించారు భక్తులకు ఎలాంటి అవాంఛనీయమైన సంఘటనలు జరగకుండా అన్ని ఏర్పాట్లను ఆలయ నిర్మాణ కర్తలు ధర్మకర్తలు ఏర్పాట్లను చేసినారు ఆలయ వేద పండితులు మాట్లాడుతూ గత 20 సంవత్సరాలుగా కుషాయిగూడ లోని శ్రీదేవి భూదేవి సమేతంగా శ్రీ వెంకటేశ్వర స్వామి కోరిక కోరిన కోరికలు తీర్చే కలియుగ వైకుంఠ దేవుడు శ్రీ వెంకటేశ్వర స్వామి అని సంతానం లేని వారికి సంతానం కలిగిందని పెళ్లి కాని వారికి పెళ్లి అయ్యిందని ఉద్యోగం లేని వారికి ఉద్యోగం దొరికిందని మనశ్శాంతి ప్రశాంతత ఇక్కడే ఉంటుందని వేలాది మంది భక్తుల ఆపదల ముక్కులవాడు ఆపద్బాంధవుడు శ్రీదేవి భూదేవి శ్రీ వెంకటేశ్వర స్వామి అని ఆలయ నిర్మాణ కర్త ఫౌండర్ మోలుగు ప్రతాప్ రెడ్డి కీర్తించారు శ్రీ వెంకటేశ్వర స్వామిని ఏది మొక్కుకున్నా కొల్చిన వారికి కొంగు బంగారం అని అందరి దేవుడని శ్రీ వెంకటేశ్వర స్వామి అని అన్నారు.

# కమ్యూనిస్టులు ఏకమైతే అధికారం చేపట్టడం అసాధ్యమేమి కాదు

## సిపిఐ పాటల సిడి ఆవిష్కరణ సభలో జాతీయ కార్యదర్శి పల్లా వెంకట రెడ్డి

**హైదరాబాద్, మహా :** కమ్యూనిస్టులంతా ఏకమైతే అధికారం చేపట్టడం అసాధ్యమేమి కాదని, ఇందుకు కలిసికట్టుగా ముందుకు సాగుదామని సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట రెడ్డి వామపక్ష పార్టీలకు పిలుపునిచ్చారు. ఈనెల 18వ తేదీన ఖమ్మంలో నిర్వహించనున్న సిపిఐ శతాబ్ధి ఉత్సవాల ముగింపు సభకు పెద్ద ఎత్తున తరలి రావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. సిపిఐ శత వసంతాల ప్రస్థానం సందర్భంగా తెలంగాణ అభ్యుదయ రచయిత సంఘం (అరసం) ఆధ్వర్యంలో కవి గడ్డమీది చంద్రమోహన్ గౌడ్ రచించిన " చలో ఖమ్మం" ఆరు గీతాలతో కూడిన సిడిని పల్లా వెంకట రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పల్లా వెంకట రెడ్డి మాట్లాడుతూ నాడు జరిగిన స్వాతంత్ర సంగ్రామంలో సిపిఐ, ప్రజా సంఘాలు సముచిత స్థానాన్ని పోషించారని పేర్కొన్నారు. సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలన్న నినాదంతో మొక్కవోని దీక్షతో ఉద్యమించిన ఏకైక పార్టీ సిపిఐ అని, ఆ తర్వాత దేశ అభివృద్ధిలో ప్రజల ఆర్థిక స్వావలంభన కోసం సంక్షేమ పథకాల అమల్లో కూడా పార్టీ క్రియాశీలక పాత్ర పోషించిందన్నారు. సిపిఐ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా సిపిఐ ఉద్యమ చరిత్రతో గడ్డమీది చంద్రమోహన్ గౌడ్ పాటలను రచించడం అభినందనీయమన్నారు. కందిమల్ల ప్రతాప రెడ్డి మాట్లాడుతూ అక్షర జ్ఞానం లేని ప్రజల్లో తమ పాటలు, రచనల ద్వారా చైతన్యం నింపిన ఘన చరిత్ర ఇప్టా, ప్రజానాట్య మండలిదేనని అన్నారు. కవులు కళాకారులు తమ పాటలు, రచనల ద్వారా ప్రజలను మరింత చైతన్యపర్చేవిధంగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు. బాజ్జీ మాట్లాడుతూ కొంత మంది దోపిడీదారులకు, పెట్టుబడిదారులకు నిలయమైన సినీ రంగంలో నిలదొక్కుకుని మొక్కవోని దీక్షతో తనకు పోరాటం చేసే శక్తిని ఇచ్చింది ప్రజానాట్య మండలేనని అన్నారు. గాయకులు డాక్టర్ సూర్యప్రకాశ్, ఆరెల్లి రవి, హేమలత పాల్గొన్నారు.



# కేంద్రం నుండి నిధుల వరద కొనసాగాలంటే కరీంనగర్ మేయర్ పీఠాన్ని బీజేపీకి అప్పగించండి

## కరీంనగర్ ప్రజలకు కేంద్ర మంత్రి బండి సంజయ్ విజ్ఞప్తి

సంజయ్ సమక్షంలో బీజేపీలో చేరిన మాజీ కార్పొరేటర్ బండారు వేణు

**కరీంనగర్, మహా :** కేంద్రం నుండి నిధుల వరద కొనసాగాలంటే కరీంనగర్ మేయర్ పీఠాన్ని బీజేపీకి అప్పగించాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ విజ్ఞప్తి చేశారు. కరీంనగర్ కార్పొరేషన్ ఎన్నికల్లో అత్యధిక డివిజన్లలో బీజేపీ కార్పొరేటర్లను గెలిపించాలని కోరారు. తద్వారా కరీంనగర్ ను మరింతగా అభివృద్ధి చేసుకునే అవకాశం ఉందన్నారు. రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో కరీంనగర్ అభివృద్ధికి నయాపైసా ఖర్చు చేయలేదన్నారు. కాంగ్రెస్ తోపాటు అధికారంలోకి లేని బీఆర్ఎస్ కు ఓటేయడంవల్ల అభివృద్ధి ఆగిపోయే ప్రమాదముందన్నారు. బుధవారం బీఆర్ఎస్ కు చెందిన 51వ డివిజన్ మాజీ కార్పొరేటర్ బండారు వేణు, మల్లంపహడ్ మాజీ సర్పంచ్ సాధినేని మునీందర్, 46వ డివిజన్ సీనియర్ నేతలు ప్రమోద్ రావు, గాజె శివరాం బీజేపీలో చేరారు. వీరితోపాటు వందలాది మంది బీఆర్ఎస్ నాయకులు సంజయ్ సమక్షంలో కాషాయ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా బండారు వేణు, సాధినేని మునీందర్, ప్రమోద్ రావు, గాజె శివరాం మాట్లాడుతూ కేంద్రం నుండి వచ్చిన నిధులవల్లే కరీంనగర్ కార్పొరేషన్ లో అభివృద్ధి జరిగిందన్నారు. స్మార్ట్ సిటీ నిధులు, అమృత్ నిధులు సహా అనేక రూపాల్లో కేంద్రం నిధులు విడుదల చేస్తోందన్నారు. బీజేపీ సిద్ధాంతాలు, కరీంనగర్ అభివృద్ధికి బండి సంజయ్ చేస్తున్న కృషికి ఆకర్షితులై బిజెపిలో చేరినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా మాజీ అధ్యక్షులు బాస సత్యానారాయణ, నగర మాజీ మేయర్లు సునీల్ రావు, డి.శంకర్, మాజీ డిప్యూటీ మేయర్ గుగ్గిళ్ల రమేశ్, సీనియర్ నాయకులు కోమాల అంజనేయులు, వాసాల రమేశ్, బోయినిపల్లి ప్రవీణ్ రావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రాణాలు తీసిన చైనా మాంజా.. గొంతు తెగి వ్యక్తి స్పాట్ డెడ్!

**సంగారెడ్డి, మహా :** సంక్రాంతి వేళ రంగురంగుల గాలిపటాలు ఎగురవేయడం అందరికీ సరదాగా ఉంటుంది. కానీ, ఆ గాలిపటం ఎగురవేసేందుకు ఉపయోగించే 'చైనా మాంజా' మాత్రం ప్రాణాల మీదకు తెస్తోంది. దీని వల్ల చాలా మంది ప్రమాదాలకు గురవుతున్నారు. ఇటీవల నిజామాబాద్‌లో చైనా మాంజా కారణంగా ఓ బాలుడికి తీవ్ర గాయమైంది. ప్రమాదం జరిగిన వెంటనే బాలుడిని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా.. అతడికి 20 కుట్లు పడ్డాయి. ఇదే కాకుండా విధి నిర్వహణలో ఉన్న పోలీస్ అధికారి ప్రాణాల మీదికి తెచ్చింది. హైదరాబాద్ నల్లకుంట పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న ఏఎస్ఐ నాగరాజు.. చైనా మాంజా కారణంగా గొంతు కోసుకుపోయి తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఉదంతాలు మరువకముందే.. చైనా మాంజా కారణంగా సంగారెడ్డి జిల్లాలో మరో దుర్ఘటన చోటుచేసుకుంది.

### వ్యక్తి స్పాట్ డెడ్

చైనా మాంజా కారణంగా మరో ప్రాణం పోయింది. ఉత్తర్ ప్రదేశ్‌కు చెందిన అవిదేశ్ (35) అనే వ్యక్తి బైక్‌పై ప్రయాణిస్తున్నాడు. ఈ క్రమంలో ఫసల్వాది ప్రాంతం వద్ద అవిదేశ్ మెడకు చైనా మాంజా చుట్టుకుంది. బైక్‌పై వేగంగా వెళ్తుండగా మాంజా మెడకు చుట్టుకోవడంతో అతడి గొంతు తెగింది. దీంతో అవిదేశ్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. దీనిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

# కేసీఆర్‌ను విమర్శించేందుకు కవిత చాలు

## మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

**దేవరకద్ర, మహా :** బీఆర్ఎస్ పార్టీని, ఆ పార్టీ అధినేత కేసీఆర్‌ను విమర్శించేందుకు తాము అవసరం లేదని, ఆయన కుమార్తె, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సరిపోతారని రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ పదేళ్లు అధికారంలో ఉండి రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిందని ఆరోపించారు. మహబూబ్ నగర్ జిల్లాలోని దేవరకద్ర నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, కేసీఆర్ రూ.7 లక్షల కోట్ల అప్పులు చేస్తే, వాటిని తమ ప్రభుత్వం తీర్చే ప్రయత్నం చేస్తోందని అన్నారు. అప్పులు తీరుస్తూనే రాష్ట్ర అభివృద్ధి కోసం తమ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని స్పష్టం చేశారు. కేసీఆర్ వల్ల పాలమూరుకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆరోపించారు. పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టుకు రూ. 80 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేయాల్సి ఉండగా, రూ. 27 వేల కోట్లు మాత్రమే ఖర్చు చేస్తే 90 శాతం పనులు ఎలా పూర్తవుతాయో చెప్పాలని ఆయన ప్రశ్నించారు. అబద్ధాలు చెప్పి మోసాలు చేయాలని చూస్తే, ప్రజలు ఇచ్చిన తీర్పును గుర్తుంచుకోవాలని హెచ్చరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒక్కరోజు కూడా సెలవు తీసుకోకుండా రాష్ట్రాభివృద్ధి కోసం పనిచేస్తున్నారని ఆయన ప్రశంసించారు. కేసీఆర్ మాత్రం ఏదో ఒకరోజు మాత్రమే పనుల కోసం సమయం కేటాయించారని విమర్శించారు. అందుకే అసెంబ్లీ, లోక్ సభ ఎన్నికల్లో ప్రజలు వారికి తగిన గుణపాఠం చెప్పారని వ్యాఖ్యానించారు. వివిధ పథకాల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసిందని తెలిపారు. మరో ఇరవై రోజుల్లో మున్సిపల్ ఎన్నికలు జరగనున్నాయని, ఆ ఎన్నికల్లో ముఖ్యమంత్రి, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు లేని పార్టీలకు ఓటు వేయడం వల్ల ఎలాంటి ఉపయోగం లేదని ఆయన అన్నారు. పని చేస్తున్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. 40 శాతం సర్పంచ్ స్థానాలను గెలిచామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చెబుతున్నారని, పార్టీ గుర్తుతో జరిగే మున్సిపల్ ఎన్నికల్లో గెలవాలని ఆయన సవాల్ విసిరారు.

# రిక్షా పుల్లర్ బిడ్డ, జడ్జి బిడ్డ ఒకే స్కూల్లో చదవాలి: సుప్రీంకోర్టు

**'సమానత్వం, స్వేచ్ఛ అనేవి వ్యక్తిగత హక్కులు కావచ్చు. కానీ, సౌభ్రాతృత్వం అనేది సంబంధాలపై ఆధారపడి ఉంటుంది. ఇది సంస్థాగత ఏర్పాట్ల ద్వారానే సాధ్యమవుతుంది' - సుప్రీంకోర్టు**



దేశంలో విద్యా వ్యవస్థ ద్వారా రాజ్యాంగం ఆశించిన 'సౌభ్రాతృత్వం' (Fraternity) లక్ష్యాన్ని సాధించే దిశగా సుప్రీంకోర్టు కీలక అడుగు వేసింది. ఒక రిక్షా కార్మికుడి పిల్లలు మల్టీ మిలియనీర్ లేదా సుప్రీంకోర్టు న్యాయమూర్తి పిల్లలతో కలిసి ఒకే తరగతి గదిలో చదువుకున్నప్పుడే అసలైన సామాజిక మార్పు సాధ్యమవుతుందని ధర్మాసనం స్పష్టం చేసింది. విద్యా హక్కు చట్టం (ఆర్‌టీఈ) కింద ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో పేద, వెనుకబడిన వర్గాల పిల్లలకు కేటాయించిన 25% ఉచిత సీట్ల అమలుపై విచారణ చేపట్టింది. ఇందుకు జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ ఏఎస్ చందుర్కర్‌లతో కూడిన ధర్మాసనం సారథ్యం వహించింది. 'ఒక ఆటో డ్రైవర్ లేదా వీధి వ్యాపారి బిడ్డ, ధనవంతుల బిడ్డతో కలిసి పాఠశాలలో ఒకే బెంచీపై కూర్చోవడం అనేది సహజమైన, నిర్మాణాత్మకమైన ప్రక్రియగా మారాలి. ఇది కేవలం ఒక సంక్షేమ పథకం కాదు. ఆర్టికల్ 21ఏ, 39(ఎఫ్) కింద దేశం చిన్నారులకు ఇచ్చిన హక్కు' అని కోర్టు పేర్కొంది. కులం, తరగతి లేదా ఆర్థిక స్థితిగతుల ఆధారంగా ఉండే 'అనుమానాస్పద గుర్తింపులను' పక్కన పెట్టి, విద్యార్థులు ఒకరితో ఒకరు మమేకంగా ఉండటానికి సెక్షన్ 12 దోహదపడుతుందని ధర్మాసనం వివరించింది.

### కొఠారి కమిషన్ నివేదిక ప్రస్తావన

సమాజంలోని అన్ని వర్గాల పిల్లలు వివక్ష లేకుండా విద్యను అభ్యసించే సాధారణ పాఠశాల వ్యవస్థపై గతంలో కొఠారి కమిషన్ ఇచ్చిన నివేదికను కోర్టు ఈ సందర్భంగా గుర్తు చేసింది. పేద పిల్లలు ధనిక వాతావరణం(Rich Culture)లో ఇమడగలరా? అనే సందేహాలను పక్కన పెట్టాలని, ఉపాధ్యాయులు ఆ పిల్లల నేపథ్యాలను ఒక వనరుగా మార్చుకుని వారి గౌరవాన్ని పెంచాలని సూచించింది.

### రాష్ట్రాలకు, ఎన్‌సీపీసీఆర్‌కు ఆదేశాలు

విద్యా హక్కు చట్టం (RTE)లోని సెక్షన్ 12(1)(సీ) కింద ఉన్న ఆదేశాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయడానికి తగిన నియమ నిబంధనలను రూపొందించాలని ధర్మాసనం స్పష్టం చేసింది. చట్టంలోని సెక్షన్ 38 కింద ఉన్న అధికారాలను ఉపయోగించి, వెనుకబడిన, బలహీన వర్గాల పిల్లల ప్రవేశాలకు సంబంధించి అవసరమైన సబార్డినేట్ చట్టాలను సిద్ధం చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరింది.

### సంప్రదింపులు

ఈ నిబంధనల రూపకల్పన ప్రక్రియ కేవలం ఏకపక్షంగా సాగకూడదని, సంబంధిత విభాగాల భాగస్వామ్యం ఉండాలని కోర్టు సూచించింది. జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ (NCPCR), రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్లు (SCPCR), జాతీయ, రాష్ట్ర స్థాయి సలహా మండలితో సమగ్రంగా సంప్రదించి విధివిధానాలను ఖరారు చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేసింది.

### రిపోర్టింగ్, పర్యవేక్షణ

ఈ ప్రక్రియ ఎంతవరకు వచ్చిందనే దానిపై సుప్రీంకోర్టు పర్యవేక్షణ గడువును విధించింది. వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు జారీ చేసిన లేదా రూపొందించిన నియమ నిబంధనలకు సంబంధించి పూర్తి సమాచారాన్ని సేకరించాలని ఎన్‌సీపీసీఆర్‌ను ఆదేశించింది. ఈ సమాచారాన్ని క్రోడీకరించి మార్చి 31లోగా ఒక సమగ్ర అఫిడవిట్‌ను దాఖలు చేయాలని ధర్మాసనం స్పష్టం చేసింది.

# వ్యాధి నిర్ధారణలో ఐసీఎంఆర్ కీలక ఆవిష్కరణ

దేశంలో అంటువ్యాధుల గుర్తింపు ప్రక్రియను వేగవంతం చేసేందుకు, ప్రాణాంతక 'యాంటీమైక్రోబయల్ రెసిస్టెన్స్'(ఏఎంఆర్) ముప్పును తగ్గించేందుకు భారత వైద్య పరిశోధనా మండలి (ఐసీఎంఆర్) సంచలనాత్మక అడుగు వేసింది. జ్వరం, శ్వాసకోశ ఇబ్బందులతో బాధపడే రోగుల్లో ఒకేసారి అనేక రకాల ఇన్ఫెక్షన్లను గుర్తించగలిగే 'మల్టీప్లెక్స్ మాలిక్యులర్ డయాగ్నొస్టిక్' పరీక్షను అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. సాధారణంగా ఆసుపత్రికి వచ్చే రోగులకు డెంగ్యూ, టైఫాయిడ్, ఇన్‌ఫ్లుయెంజా లేదా కొవిడ్ వంటి లక్షణాలు ఉన్నప్పుడు వైద్యులు ఒక్కో వ్యాధికి విడివిడిగా పరీక్షలు నిర్వహిస్తారు. ఒక నివేదిక నెగటివ్ వస్తేనే మరో పరీక్షకు వెళ్లే ఈ దశల వారీ విధానం వల్ల కొన్ని సమస్యలున్నాయి. ఈ విధానం ద్వారా వ్యాధి నిర్ధారణలో తీవ్ర జాప్యం జరుగుతోంది. రోగి పరిస్థితి విషమించే ప్రమాదం ఉంది. వైద్య ఖర్చులు కూడా భారీగా పెరుగుతున్నాయి. ఈ సమస్యను పరిష్కరించడానికి ఒకేసారి బహుళ వ్యాధికారక క్రిములను (Pathogens) గుర్తించే సింగిల్‌టెస్ట్ మోడల్‌ను అందుబాటులోకి తీసుకురావాలని ఐసీఎంఆర్ ప్రణాళిక రూపొందించింది.




**యాంటీబయాటిక్స్ దుర్వినియోగానికి అడ్డుకట్ట**

వ్యాధి ఏంటో స్పష్టంగా తెలియనప్పుడు వైద్యులు తప్పనిసరి పరిస్థితుల్లో 'బ్రాడ్‌స్పెక్ట్రమ్ యాంటీబయాటిక్స్' వాడుతుంటారు. దీనిపై ఎయిమ్స్ మైక్రోబయాలజీ ప్రొఫెసర్ డాక్టర్ హితేందర్ గౌతమ్ స్పందిస్తూ.. 'కచ్చితమైన నివేదిక లేకుండా ఎక్కువ కాలం యాంటీబయాటిక్స్ వాడటం వల్ల శరీరంలో సూక్ష్మజీవుల నిరోధక శక్తి పెరుగుతుంది' అని హెచ్చరించారు. ఐసీఎంఆర్ ఏఎంఆర్ఎస్ఎన్ 2024 నివేదిక ప్రకారం, ప్రస్తుతం వాడుకలో ఉన్న అనేక యాంటీబయాటిక్స్ బ్యాక్టీరియాపై ప్రభావం కోల్పోతున్నాయని తేలింది. కొత్త మల్టీప్లెక్స్ పరీక్షల వల్ల కచ్చితమైన చికిత్స త్వరగా మొదలై ఈ ముప్పు తగ్గుతుంది.

**సింగిల్ టెస్ట్ కు సంబంధించిన కీలక అంశాలు**

రోగి లక్షణాల ఆధారంగా ఒకే టెస్ట్‌లో అన్ని అనుమానిత ఇన్ఫెక్షన్లను పరీక్షించడం. ఈ డయాగ్నొస్టిక్ కిట్లను అభివృద్ధి చేయడానికి భారతీయ తయారీదారులు, పరిశోధన సంస్థలకు ఐసీఎంఆర్ మద్దతు ఇస్తుంది. ఈ ప్రాజెక్టుకు సంబంధించి ప్రతిపాదనలు సమర్పించడానికి జనవరి 25ను చివరి తేదీగా నిర్ణయించారు. కొవిడ్ సమయంలో ఎదురైన అనుభవాలను దృష్టిలో ఉంచుకుని వ్యాధుల వ్యాప్తిని ప్రారంభ దశలోనే అరికట్టేందుకు చర్యలు చేపడుతున్నారు. అందులో భాగంగా ఈ వేగవంతమైన నిర్ధారణ పరీక్షలు దేశ ప్రజారోగ్య వ్యవస్థలో కీలక మార్పుగా నిలవనున్నాయి.

# ఇన్ఫోసిస్‌కూ తప్పలేదు


**ముంబై:** సాఫ్ట్‌వేర్ సేవల దేశీ దిగ్గజం ఇన్ఫోసిస్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025-26) మూడో త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు ప్రకటించింది. అక్టోబర్-డిసెంబర్(క్యూ3)లో కన్సాలిడేటెడ్ నికర లాభం వార్షికంగా 2 శాతం క్షీణించి రూ. 6,654 కోట్లకు పరిమితమైంది. కొత్త కార్మిక చట్టాల అమలు నేపథ్యంలో రూ. 1,289 కోట్లమేర వన్‌టైమ్ కేటాయింపులు ప్రభావం చూపినట్లు కంపెనీ పేర్కొంది. గతేడాది(2024-25) ఇదే కాలంలో రూ. 6,806 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం మాత్రం 9 శాతం ఎగసి రూ. 45,479 కోట్లను తాకింది. గత క్యూ3లో రూ. 41,764 కోట్ల టర్నోవర్ సాధించింది. కాగా.. ఈ ఏడాది క్యూ2(జూలై-సెప్టెంబర్)తో పోలిస్తే నికర లాభం 9.6 శాతం క్షీణించగా.. ఆదాయం 2.2 శాతం పుంజుకుంది.

**ఏఐలో ముందంజ**

ఎంటర్‌ప్రైజ్ ఏఐలో ప్రత్యేకత కలిగిన విలువ ఆధారిత సర్వీసులను టోపజ్ ప్లాట్‌ఫామ్ ద్వారా అందిస్తున్నట్లు కంపెనీ సీఈవో, ఎండీ సలీల్ పరేఖ్ పేర్కొన్నారు. తద్వారా మార్కెట్ వాటాను పెంచుకుంటున్నట్లు తెలియజేశారు. కంపెనీకున్న నైపుణ్యం, కొత్త ఆవిష్కరణలు, పటిష్ట డెలివరీ సామర్థ్యాలు క్లయింట్లను ఆకట్టుకుంటున్నట్లు వివరించారు. దీంతో ఇన్ఫోసిస్‌ను తమ భాగస్వామిగా ఎంచుకుంటున్నట్లు తెలియజేశారు. ఈ కాలంలో కంపెనీ చరిత్రలోనే అత్యధికంగా రూ. 18,000 కోట్లు వెచ్చించి షేర్ల బైబ్యాక్‌తో పాటు వాటాదారులకు మధ్యంతర డివిడెండ్‌ను సైతం చెల్లించింది. గతంలో ప్రకటించిన విధంగా ఈ ఏడాది 20,000 మంది ఫ్రెషర్స్‌కు ఉపాధి కల్పించనున్నట్లు సీఎఫ్‌వో జయేష్ ఎస్. పేర్కొన్నారు. ఈ బాటలో ఇప్పటికే 18,000 మందికి ఉద్యోగాలిచ్చినట్లు తెలిపారు.

**ఇతర విశేషాలు**

తాజా సమీక్షా కాలంలో ఇన్ఫోసిస్ 4.8 బిలియన్ డాలర్ల విలువైన కాంట్రాక్టులను కుదుర్చుకుంది. వీటిలో 57 శాతం కొత్తగా సాధించిన ఆర్డర్లు కావడం గమనార్హం! యూకే నేషనల్ హెల్త్ సర్వీస్‌తో 1.6 బిలియన్ డాలర్ల విలువైన కాంట్రాక్ట్ అందుకుంది. మార్చితో ముగిసే పూర్తి ఏడాదికి ఆదాయ అంచనాలను 3-3.5 శాతానికి మెరుగుపరచింది. ఇంతక్రితం 2-3 శాతం ఆదాయ వృద్ధిని ప్రకటించిన సంగతి తెలిసిందే. 2025 డిసెంబర్ 31కల్లా 5,043 మంది ఉద్యోగులు జత కలిశారు. దీంతో మొత్తం సిబ్బంది సంఖ్య 3,37,034కు చేరింది. కంపెనీ సీఈవో పరేఖ్‌కు రూ. 3 కోట్ల విలువైన స్టాక్ ప్రోత్సాహకాల(ఆర్ఎస్‌యూలు) కేటాయిం చేందుకు బోర్డు అనుమతించినట్లు ఇన్ఫోసిస్ వెల్లడించింది. కొత్త కార్మిక చట్టాల ప్రభావంతో ఇప్పటికే ఐటీ దిగ్గజాలు టీసీఎస్ రూ. 2,128 కోట్లు, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ రూ. 719 కోట్లు చొప్పున క్యూ3 లో కేటాయింపులు చేపట్టిన విషయం విదితమే.



## దేశం-విదేశం | NATIONAL-INTERNATIONAL



# గ్రీన్‌లాండ్ సొంతం కావాల్సిందే!

## ఇంక దేనికీ ఒప్పుకోం: ట్రంప్

**నాటో సాయపడాలని వ్యాఖ్య**
**గ్రీన్‌లాండ్‌లో వెల్లువెత్తుతున్న నిరసనలు**




**నూక్ (గ్రీన్‌లాండ్):** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గ్రీన్‌లాండ్ నామజపం నానాటికీ శ్రుతి మించుతోంది. ఆ ద్వీపం పూర్తిగా అమెరికా వశం అయి తీరాల్సిందేనని, అది తప్ప ఇంక దేనికీ అంగీకరించే ప్రసక్తే లేదని ఆయన బుధవారం పునరుద్ఘాటించారు. అంతేకాదు, అందుకు నాటో కూటమి ఇతోధికంగా సాయపడాలని చెప్పుకొచ్చారు. వెనెజువెలాపై సైనిక చర్యతో అధ్యక్షుడు మదురో దంపతులను నిర్బంధించిన అనంతరం ట్రంప్ తన దృష్టినంతా గ్రీన్‌లాండ్‌పై కేంద్రీకరించడం తెలిసిందే. ఇది గ్రీన్‌లాండ్‌తో పాటు ఆ ద్వీపాన్ని నియంత్రిస్తున్న డెన్మార్క్‌తో తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. అవసరమైతే సైనిక చర్య తప్పదని ట్రంప్, అలాగైతే తొలి తూటా పేల్చేది తామేనని డెన్మార్క్ పోటాపోటీ ప్రకటనలతో వాతావరణం బాగా వేడెక్కింది. ఈ పరిస్థితుల్లో ఉద్రిక్తతలను చల్లార్చేందుకు ఒకవైపు డెన్మార్క్, గ్రీన్‌లాండ్ విదేశాంగ మంత్రులు, ఉన్నతాధికారులతో కూడిన బృందంతో అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, విదేశాంగ మంత్రి మార్కో రూబియో వాషింగ్టన్‌లో భేటీ అవుతుండగా, అంతకు కేవలం కొద్ది గంటల ముందు ట్రంప్ మళ్లీ ఇలా రెచ్చగొట్టే వ్యాఖ్యలకు దిగారు. 'అమెరికా జాతీయ భద్రత నిమిత్తం గ్రీన్‌లాండ్ మాకు కావాల్సిందే. ఆ ప్రయత్నాలకు నాటో కూటమే సారథ్యం వహించాలి. లేదంటే గ్రీన్‌లాండ్‌పై రష్యా, చైనా పట్టు సాధిస్తాయి. అలా జరగనివ్వబోం' అని సొంత సోషల్ మీడియా 'ట్రూత్ సోషల్'లో ఆయన వరుస పోస్టులు పెట్టారు. 'మేం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన గోల్డెన్ డోమ్ రక్షణ వ్యవస్థలో గ్రీన్‌లాండ్ అతి కీలకం' అని పేర్కొన్నారు. అంతేకాదు, గ్రీన్‌లాండ్ అమెరికా గుప్పెట్లోకి వస్తే నాటో మరింత బలోపేతమైన శక్తిగా మారుతుందని చెప్పుకొచ్చారు. డెన్మార్క్, గ్రీన్‌లాండ్ ప్రతినిధుల బృందం ఇప్పటికే వైట్‌హౌస్‌లో ఒక దఫా అమెరికా బృందంతో చర్చలు జరిపింది. వాన్స్‌తో భేటీ అనంతరం సెనేటర్లు, ఇతర ఉన్నతాధికారులతో వారు మరోసారి సమావేశం కానున్నారు. మరోవైపు, గ్రీన్‌లాండ్ స్వాధీన ప్రయత్నాలకు రక్షణ, లేదా ఇతర శాఖల నుంచి నిధులు వెచ్చించేందుకు వీల్లేదంటూ ఇద్దరు సెనేటర్లు తాజాగా బిల్లు ప్రవేశపెట్టారు. వీరిలో ఒకరు అధికార రిపబ్లికన్ పార్టీకి చెందినవారు కావడం విశేషం. శుక్ర, శనివారాల్లో వారి బృందం డెన్మార్క్‌లో పర్యటించనుంది. డెన్మార్క్ ప్రధాని తదితరులతో భేటీ కావాలని వారు నిశ్చయించారు. తమ ద్వీపాన్ని స్వాధీనం చేసుకునేందుకు అమెరికా చేస్తున్న ప్రయత్నాలపై గ్రీన్‌లాండ్‌వాసులు మండిపడుతున్నారు. తాము అమ్మకానికి సిద్ధంగా లేమంటూ నినదిస్తున్నారు. ''మేం డెన్మార్క్‌ను ఎంచుకున్నాం. ఆ దేశంలో భాగంగా, యూరోపియన్ యూనియన్ భాగస్వామిగా మాత్రమే కొనసాగుతాం. అంతే తప్ప అమెరికాలో 51వ రాష్ట్రంగా చేరడం కల్ల'' అని అంతర్జాతీయ మీడియా ప్రతినిధులతో వారు కుండబద్దలు కొడుతున్నారు. చైనా, రష్యాలతో తమ ద్వీపానికి ముప్పుందన్న ట్రంప్ వాదనను గ్రీన్‌లాండ్‌వాసులు ఎద్దేవా చేస్తున్నారు. ఆయన నోట వస్తున్నవన్నీ కాల్పనిక గాథలని వారు చెప్పుకొచ్చారు. ''ట్రంప్‌కు కావాల్సింది కేవలం మా ద్వీపంలోని అపార సహజ వనరులే. వాటికోసమే ఇలా ఇతర దేశాలను బూచిగా చూపుతూ ప్రయాస పడుతున్నారు'' అని మండిపడ్డారు. మరోవైపు, ఫిబ్రవరి 6న గ్రీన్‌లాండ్‌లో దౌత్య కార్యాలయం తెరుస్తున్నట్టు నాటో సభ్య దేశమైన ఫ్రాన్స్ కీలక ప్రకటన చేసింది. గ్రీన్‌లాండ్‌పై దాడి తప్పదన్న బ్లాక్‌మెయిలింగ్‌కు అమెరికా స్వస్తి పలకాలని ఫ్రాన్స్ విదేశాంగ మంత్రి జీన్ నోయల్ బారొట్ హితవు పలికారు.

### డెన్మార్క్, గ్రీన్‌లాండ్ నేతల యునైటెడ్ ఫ్రంట్!

ట్రంప్‌కు వ్యతిరేకంగా డెన్మార్క్, గ్రీన్‌లాండ్ సంఘటితమవుతున్నాయి. ఈ దిశగా సమైక్య పోరు కోసం యునైటెడ్ ఫ్రంట్ ఏర్పాటు చేయాలని వారు నిర్ణయానికి వచ్చారు. "గ్రీన్‌లాండ్ పూర్తిగా డెన్మార్క్‌కు చెందిన భాగమే. కనుక దానికి నాటో సైనిక రక్షణ పూర్తిస్థాయిలో కొనసాగుతుంది" అని ఇరు దేశాల ప్రధానులు మెట్టె ఫ్రెడరిక్సన్, జీన్స్ నీల్సన్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు. "ప్రియ మైన గ్రీన్‌లాండ్‌వాసు లారా.. ఈ రోజు మనమంతా సంయుక్తంగా ఒక్కతాటిపై నిలబడి ఉన్నాం. ముమ్ముందూ అలాగే ఉండబోతున్నాం" అని ఫ్రెడరిక్సన్ కోపెన్ హాగెన్‌లో మీడియా భేటీలో ప్రకటించారు. "అమెరికా, డెన్మార్క్‌లలో ఏదో ఒకదా న్నే ఎంచుకోవాల్సి వస్తే మా చాయిస్ ఎప్పటికీ డెన్మార్కే. నాటోనే. యూరోపియన్ యూని యనే" అని నీల్సన్ కుండబద్దలు కొట్టారు.





# దాడులకు అమెరికా రెడీ!

## ఖతార్ సైనికస్థావరం నుంచి బయల్దేరిన సైనికులు

**ఇరాన్‌లో మరింత ఉధృతమైన నిరసనలు .. 2,571కు పెరిగిన మరణాలు**
**ఆందోళనకారులపై ఖమేనీ ప్రభుత్వం కాస్తయినా దయ చూపాలి**
**అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సూచన**

దుబాయ్/వాషింగ్టన్/బ్యాంకాక్/న్యూఢిల్లీ: ఇరాన్‌తో వాణిజ్యంచేసే దేశాలపై పాతిక శాతం సుంకాలువేసి టారిఫ్‌ల కొరడా ఝళిపించిన ట్రంప్ సేన హఠాత్తుగా సుంకాల మాటెత్తకుండా సైన్యంతో దండెత్తబోతోందన్న వార్త సంచలనం సృష్టిస్తోంది. దీనికి బలం చేకూర్చేలా ఖతార్‌లోని అమెరికా సైనిక స్థావరం నుంచి పెద్దసంఖ్యలో బలగాలు ఇరాన్ దిశగా కదులుతున్నట్లు వార్తలొచ్చాయి. అయితే తమ బలగాలపై ఇరాన్ దాడి చేయొచ్చనే ముందస్తు అంచనాతోనే తమ సైన్యాన్ని స్థావరం నుంచి వేరే ప్రాంతానికి తరలిస్తున్నామని, దాడి ఉద్దేశం తమకు లేదని అమెరికా అధికారి ఒకరు చెప్పారు. అయితే, ఆందోళనకారులపై కాల్పులు జరిపితే కన్నెర్ర జేస్తానని ఇప్పటికే ప్రకటించిన ట్రంప్.. ఇప్పుడు ఏకంగా తమ స్థావరం మీదనే ఇరాన్ దాడులకు దుస్సాహసం చేస్తే చూస్తూ ఊరుకోబోడని, ఇరాన్ కంటే ముందే దాడులతో విరుచుకుపడతాడని అంతర్జాతీయ యుద్ధరంగ నిపుణులు విశ్లేషిస్తున్నారు. మరోవైపు ఇరాన్‌లో ఆందోళనలు మరింత ఉధృతమయ్యాయి. తొలుత వందల్లో కన్పించిన మరణాలు ఇప్పుడు వేలల్లో తేలుతున్నాయి. అయతొల్లా అలీ ఖమేనీ ప్రభుత్వం పరిపాలనా బాధ్యతల నుంచి తప్పుకోవాలంటూ మొదలైన ఆందోళనల్లో, పోలీసులతో ఘర్షణల్లో ఇప్పటిదాకా 2,571 మంది ప్రాణాలు కోల్పోయారు. చనిపోయిన వారిలో 2,403 మంది ఉద్యమకారులు కాగా 147 మంది పోలీసులు ఉన్నారు. ఉద్యమంలో పాల్గొనని, అభంశుభం ఎరుగని 12 మంది చిన్నారులు, 9 మంది పౌరులు సైతం ఈ ఘర్షణల్లో చనిపోయారని అమెరికా కేంద్రంగా పనిచేసే 'ది హ్యూమన్ రైట్స్ యాక్టివిస్ట్స్ న్యూస్ ఏజెన్సీ' బుధవారం ప్రకటించింది. ఉద్యమాన్ని ఉక్కు పాదంతో అణచేస్తున్న ప్రభుత్వం ఇప్పటిదాకా 18,100 మందిని నిర్బంధంలోకి తీసుకుంది.

**దీటుగా బదులిస్తాం..**

దాడులు చేస్తామని బెదిరిస్తున్న అమెరికాకు దీటుగా బదులిస్తామని ఖమేనీ ప్రభుత్వం పునరుద్ఘాటించింది. ఈ మేరకు ఖమేనీ సలహాదారు అలీ షామ్‌ఖానీ 'ఎక్స్'లో ఒక పోస్ట్ పెట్టారు. ''గతంలో ఇరాన్ అణు స్థావరాలపై దాడులు చేశామని ప్రగల్భాలు పలికే ట్రంప్.. మేం మీ అల్ ఉదేయిద్ స్థావరంపై క్షిపణులతో దాడి చేసి వినాశనం సృష్టించిన విషయాన్ని ఎందుకు మర్చిపోతున్నారు?. ఆనాటి మా దాడి మా సంకల్పం, సామర్థ్యాలకు బలమైన నిదర్శనం'' అని ఆయన వ్యాఖ్యానించారు.

**స్టార్‌లింక్ నుంచి ఉచిత ఇంటర్నెట్ సేవలు**

ఉద్యమకారులపై పోలీస్‌ల దమనకాండతో రక్తసిక్తమవుతున్న ఇరాన్‌లో వాస్తవ పరిస్థితులు ఇంటర్నెట్, ఫోన్ సేవలు నిలిచిపోవడంతో ఎప్పటికప్పుడు తెలిసే పరిస్థితి లేకుండా పోయింది. దీంతో ఎలాన్ మస్క్‌కు చెందిన స్టార్‌లింక్ సంస్థ ఉచితంగా ఉపగ్రహ ఇంటర్నెట్ సేవలు అందిస్తోందని ఉద్యమకారులు బుధవారం వెల్లడించారు. అయితే ఈ వార్తలను స్టార్‌లింక్ ఇంకా అధికారికంగా ధృవీకరించలేదు. ''టెహ్రాన్ ఫోరెన్సిక్ వైద్య కేంద్రం వరండాలో వరసబెట్టి మృతదేహాలు పడి ఉన్నాయి. ఇలాంటి దారుణోదంతాలను బయటి ప్రపంచానికి తెలియజేయాలంటే కనీసం ఇంటర్నెట్ సదుపాయం ఉండాలి. ఈ విషయంలో స్టార్‌లింక్ పాత్ర కీలకం'' అని ఇరాన్‌లోని మెహ్‌దీ యాహ్యానిజాద్ అన్నారు.

**ఇరాన్‌ను వీడాలన్న భారత్**

పరిస్థితులు ఉద్రిక్తంగా మారడంతో ఇరాన్‌లోని తమ పౌరులు, భారతీయులు వెంటనే దేశం వీడాలని టెహ్రాన్‌లోని భారత రాయబార కార్యాలయం ఒక అడ్వైజరీ జారీచేసింది. ఉద్యమస్థలాల వైపు వెళ్లొద్దని, ఎంబసీ వద్ద తమ పేర్లను నమోదుచేసుకోవాలని తమ పౌరులకు రాయబార కార్యాలయం సూచించింది. మరోవైపు ఇరాన్‌కు ప్రయాణాలను వాయిదావేసుకోవాలని భారత్‌లోని పౌరులకు భారత విదేశాంగ శాఖ ఒక సూచన చేసింది.




# లోకేశ్‌తో ఫిక్స్

'పుష్ప: ది రైజ్' (2021), 'పుష్ప 2: ది రూల్' (2024) సినిమాలతో అంతర్జాతీయ స్థాయిలో క్రేజ్ సొంతం చేసుకున్నారు హీరో అల్లు అర్జున్. ఆయన నటిస్తున్న తాజా చిత్రం 'ఏఏ 22' (వర్కింగ్ టైటిల్). తమిళ దర్శకుడు అట్లీ తెరకెక్కిస్తున్న ఈ మూవీలో దీపికా పదుకోన్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. కళానిధి మారన్ సమర్పణలో సన్ పిక్చర్స్ నిర్మిస్తున్న ఈ పాన్ ఇండియా మూవీ ప్రస్తుతం ముంబైలో చిత్రీకరణ జరుపుకుంటోంది. ఈ సినిమా తర్వాత అల్లు అర్జున్ ఎవరి దర్శకత్వంలో నటిస్తారు? అంటే... లోకేశ్ కనగరాజ్, సందీప్ రెడ్డి వంగా, బాసిల్ జోసెఫ్ పేర్లు వినిపించాయి. ఫైనల్‌గా ఆ అవకాశాన్ని లోకేశ్ కనగరాజ్ అందుకున్నారు. అల్లు అర్జున్ నటించనున్న 'ఏఏ 23' (వర్కింగ్ టైటిల్) సినిమాకి దర్శకుడిగా లోకేశ్ కనగరాజ్ ఫిక్స్ అయ్యారు. మైత్రీ మూవీ మేకర్స్, బన్నీ వాసు వర్క్స్‌పై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. బన్నీ వాసు, నట్టి, శాండీ, స్వాతి సహ నిర్మాతలుగా వ్యవహరించ నున్న ఈ మూవీని బుధవారం ప్రకటించారు. "ఇండియన్ సినీ ఇండస్ట్రీలో ఇద్దరు స్టార్స్ కలిసి పని చేయబోతున్న 'ఏఏ 23' ప్రేక్షకులకు అద్భుతమైన అనుభూతిని అందించేలా ఉంటుంది. అల్లు అర్జున్‌ని ఇప్పటివరకు చూడని కొత్త లుక్‌లో చూపించనున్నారు లోకేశ్ కనగరాజ్. అనిరుధ్ రవిచందర్ సంగీతం అందించనున్న ఈ సినిమా చిత్రీకరణను ఈ ఆగస్టులో ఆరంభిస్తాం" అని చిత్రయూనిట్ పేర్కొంది.

## నారీ నారీ నడుమ మురారి

# మూవీ రివ్యూ అండ్ రేటింగ్

**ఈ సంక్రాంతికి చివరగా వచ్చిన సినిమా 'నారి నారి నడుమ మురారి'. మిగతా సినిమాలతో పోల్చితే దీనికి పెద్దగా ప్రమోషన్స్ చేయలేదు. కానీ ట్రైలర్ రిలీజ్ తర్వాత ఈ చిత్రంపై కాస్త ఆసక్తి పెరిగింది. ఎలాంటి అంచనాలు లేకుండా ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం ఎలా ఉంది? వరుస ఫ్లాపులతో సతమతవుతున్న శర్వా.. ఈ చిత్రంతో హిట్ ట్రాక్ ఎక్కడా? లేదా? రివ్యూలో చూద్దాం.**



### కథేంటంటే..

ఆర్కిటెక్ట్ గౌతమ్(శర్వానంద్).. నిత్య(సాక్షి వైద్య)తో ప్రేమలో ఉంటాడు. తల్లి చిన్నప్పుడే చనిపోవడంతో.. ఆయన తండ్రి కార్తిక్(నరేశ్)కి లేటు వయసులో ప్రేమించిన యువతి పల్లవి(సిరి హనుమంతు)తో పెళ్లి జరిపిస్తాడు. ఆ తర్వాత తన ప్రియురాలు నిత్యని పెళ్లి చేసుకోవాలనుకుంటాడు. నిత్య తండ్రి రామలింగయ్య(సంపత్ రాజ్) తొలుత ఈ పెళ్లికి ఒప్పుకోడు. కానీ కూతురు బాధ చూడలేక చివరకు ఒప్పుకుంటాడు. అయితే రిజిస్టర్ ఆఫీస్‌లోనే పెళ్లి చేసుకోవాలని షరతు విధిస్తాడు.

తప్పనిసరి పరిస్థితుల్లో గౌతమ్ ఈ రిజిస్టర్ పెళ్లికి ఒప్పుకుంటాడు. పెళ్లి దరఖాస్తు కోసం రిజిస్టర్ ఆఫీసుకి వెళ్లగా.. గౌతమ్‌కి అనుకొని సమస్య ఎదురవుతుంది? అదేంటి? దియా(సంయుక్త) ఎవరు? గౌతమ్‌కి ఆమెకు మధ్య ఉన్న సంబంధం ఏంటి? పెళ్లి కోసం కొడుకు చెప్పే అబద్ధాల కారణంగా కార్తీక్‌పల్లవిల దాంపత్య జీవితంలో ఎలాంటి మలుపు వచ్చాయి. చివరకు గౌతమ్‌నిత్యల పెళ్లి జరిగిందా లేదా? ఈ కథకి లవకుశ(సత్య), సత్యమూర్తి(సునీల్), గుణశేఖర్(వెన్నెల కిశోర్)ల పాత్రలకు ఉన్న సంబంధం ఏంటి? అనేది తెలియాలంటే సినిమా చూడాల్సిందే(Nari Nari Naduma Murari Review).

**ఎలా ఉందంటే..**

కామెడీ సినిమాలకు కథకథనం ఎలా ఉన్నా సరే..కడుపుబ్బా నవ్విస్తే చాలు.. ప్రేక్షకులు ఆ సినిమాను ఆదరిస్తారు. ఇక బలమైన కథ.. ఆ కథలోని పాత్రలకు సరైన నటీనటులు తోడైతే అది నారీ నారీ నడుము మురారీ సినిమా అవుతుంది. సామజవరగమన లాంటి బ్లాక్ బస్టర్ తర్వాత దర్శకుడు రామ్ అబ్బరాజు..మరోసారి అలాంటి కామెడీ కథతోనే ఈ సినిమాను తెరెక్కించాడు. కథలో కొత్తదనం లేకున్నా.. స్క్రీన్‌ప్లేతో మరోసారి మ్యాజిక్ చేశాడు. ముఖ్యంగా డైలాగులు అదిరిపోతాయి. కథనం మొత్తం కరెంట్ పంచ్ డైలాగులతో హిలేరియస్ యాంగిల్ లో సాగుతుంది.

ఆరు పదుల వయసులో హీరో తండ్రి.. పాతికేళ్ల వయసు ఉన్న అమ్మాయిని ప్రేమించడం.. ఇంట్లోవాళ్లు ఒప్పుకోకపోవడంతో ఆమెను స్వయంగా కొడుకే తీసు కొచ్చి.. పెళ్లి చేయించే సన్నివేశంతో సినిమా ప్రారంభం అవుతుంది. ఇలా సినిమా ప్రారంభం నుంచి నవ్వుల యాత్రను ప్రారంభించాడు దర్శకుడు. ఆ తర్వాత గౌతమ్‌నిత్యల లవ్‌స్టోరీని 'పులిహోర'తో ముడిపెడుతూ చాలా హిలేరియస్‌గా చూపించాడు. ఈ జంట పెళ్లి కోసం రిజిస్టర్ ఆఫీస్‌కి వెళ్లిన తర్వాత అసలు కథ ప్రారంభం అవుతుంది.

దియా ఎంట్రీతో కథనం మరో మలుపు తిరుగుతుంది. ఇంటర్వెల్ సీన్ సెకండాఫ్‌పై ఆసక్తిని పెంచుతుంది. ఇక ద్వితియార్థంలో కామెడీ డోస్ మరింత పెరగుతుంది. వెన్నెల కిశోర్ ఎంట్రీ..శ్రీమంతం ఎపిసోడ్.. విడాకుల పేరుతో నడిచే కోర్టు డ్రామా.. అన్ని నాన్‌స్టాఫ్‌గా నవ్విస్తాయి. ముఖ్యంగా నరేశ్ పాత్ర చుట్టూ వచ్చే సన్నివేశాలు..ఆయన చెప్పే డైలాగులకు పడి పడి నవ్వుతారు. ఆయన పర్సనల్ లైఫ్‌పై కూడా పంచ్‌లు వేసుకోవడం..మరింత ఫన్‌ని జనరేట్ చేసింది. ప్రీక్లైమాక్స్ నుంచి కథనం కాస్త ఎమోషనల్‌గా సాగుతుంది. అయితే క్లైమాక్స్‌లో కూడా మళ్లీ నరేశ్‌పై పంచ్ డైలాగులు వేయడంతో నవ్వుకుంటూ ప్రేక్షకులు థియేటర్ నుంచి బయటకు వస్తారు. ఒకటి రెండు డైలాగులు మినహా ఎలాంటి వల్గారిటీ, బూతు సీన్లు లేకుండా క్లీన్ కామెడీతో ఫ్యామిలీ మొత్తం చూసేలా ఈ సినిమాను తెరకెక్కించారు. కథలో కొత్తదనం ఆశించకుండా ఫ్యామిలీతో కలిసి ఈ సినిమాకు వెళ్తే..హాయిగా రెండున్నర గంటల పాటు నవ్వుకోవచ్చు((Positive And Negatives Of Nari Nari Naduma Murari Movie).

**ఎవరెలా చేశారంటే...**

గౌతమ్ పాత్రలో శర్వానంద్ ఒదిగిపోయాడు. టైటిల్‌కి తగ్గట్టే ఇద్దరి అమ్మాయిల మధ్య నలిగిపోయే యువకుడి పాత్ర ఇది. శర్వా పాత్ర టెన్షన్ పడే ప్రతిసారి ప్రేక్షకుడి నవ్వు ఆగదు. ఇక ఈ సినిమాకు రెండో హీరో నరేశ్. లేటు వయసులో ప్రేమ పెళ్లి చేసుకున్న కార్తిక్ పాత్రలో ఆయన జీవించేశాడు. ఆయన నిజ జీవితానికి ఈ పాత్రకు మధ్య పోలికలు ఉండడం.. డైలాగులు కూడా అలానే ఉండడంతో ప్రేక్షకులు పగలబడి నవ్వుతారు. సెకండాఫ్‌లో ఆయనకు మంచి సీన్లు పడ్డాయి.

ఇక హీరోయిన్లు సాక్షి వైద్య, సంయుక్త.. ఇద్దరూ తమ తమ పాత్రల పరిధిమేర చక్కగా నటించారు. కథకు సంబంధం లేకున్నా.. సత్య కామెడీ బాగా వర్కౌట్ అయింది. గురువుపై విపరీతమైన ప్రేమ చూసే గుణశేఖర్‌గా వెన్నెల కిశోర్ తనదైన నటనతో నవ్వించేశాడు. సంపత్ రాజు, సునీల్, సుదర్శన్.. ఇలా ప్రతి ఒక్కరు అవకాశం ఉన్న ప్రతి చోట నవ్విస్తూనే ఉంటారు. భాను భోగవరపు అందించిన కథ.. డైలాగులు బాగున్నాయి. కేవలం హీరోకు మాత్రమే కాదు సినిమాలో అన్నిపాత్రలకు అదిరిపోయే డైలాగులు ఉంటాయి. రామ్ మంచి స్క్రీన్‌ప్లేతో ఫుల్ ఎంటర్‌టైనింగ్‌గా సినిమాను తెరకెక్కించాడు. విశాల్ చంద్రశేఖర్ నేపథ్య సంగీతం బాగుంది. పాటలు అంతగా గుర్తుండవు. జ్ఞానశేఖర్, యువరాజ్‌ల సినిమాటోగ్రఫీ బాగుంది. నిర్మాణ విలువలు సినిమా స్థాయికి తగ్గట్లు ఉన్నతంగా ఉన్నాయి.



# మూడేళ్ల కష్టానికి తగ్గ ఫలితం వచ్చింది

"ది రాజా సాబ్' సినిమాకు ప్రేక్షకుల నుంచి వస్తున్న స్పందనతో సంతోషంగా ఉన్నాను. ఈ సినిమా కోసం యూనిట్ అంతా మూడేళ్లు కష్టపడ్డాం. ఆ కష్టానికి తగ్గ ఫలితాన్ని ప్రేక్షకులు ఇచ్చారని భావిస్తున్నాం. ఈ సినిమాలో నన్‌గా నేను చేసిన బెస్ట్ రోల్ కోసం చాలా ప్రిపేర్ అయ్యాను" అని నిధీ అగర్వాల్ తెలిపారు. ప్రభాస్ హీరోగా నటించిన చిత్రం 'ది రాజా సాబ్'. మారుతి దర్శకత్వం వహించిన ఈ సినిమాలో నిధీ అగర్వాల్, మాళవికా మోహనన్, రిద్ధీ కుమార్ హీరోయిన్లుగా నటించారు. టీజీ విశ్వప్రసాద్, కృతీ ప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 9న విడుదల అయింది. ఈ నేపథ్యంలో నిధీ అగర్వాల్ మాట్లాడుతూ– "ది రాజా సాబ్'లో తాంత్రిక విద్యలు, సైకలాజికల్ గేమ్స్ ఆడే ఓ దుష్టశక్తిని దైవికంగా ఎదుర్కోవడాన్ని కొత్తగా చూపించారు మారుతిగారు. ప్రభాస్‌గారు తానో బిగ్గెస్ట్ పాన్ ఇండియా స్టార్ అనుకోరు. మా అందరితో సరదాగా కలిసిపోయేవారు. విజువల్ ఎఫెక్ట్స్, భారీ సెట్స్, ప్రొడక్షన్ క్వాలిటీ విషయంలో విశ్వప్రసాద్‌గారు రాజీ పడలేదు. 'హరి హర వీరమల్లు' సినిమాతో పాటు 'ది రాజా సాబ్' సినిమా షూటింగ్ ఒకే సమయంలో చేశాను. ఈ సినిమాల షూటింగ్స్, ప్రయాణం వల్ల నిద్ర కూడా ఉండేది కాదు. ఆ టైమ్‌లో 'రాజా సాబ్' మేకర్స్ సెట్‌లో నన్ను బాగా చూసుకునేవారు. అందుకే నేనంటే సెట్‌లో అందరికీ ఇష్టమని ప్రభాస్‌గారు చెప్పారు. ఈ సంక్రాంతికి వచ్చిన ప్రతి సినిమా ఆదరణ పొందాలని కోరుకున్నాను. ఎందుకంటే... మేమంతా ఒకే పడవలో వెళ్తున్నాం. ప్రమాదం జరగాలని చూస్తే అందరం మునిగిపోతాం. ప్రస్తుతం తెలుగులో మూడు, హిందీలో రెండు సినిమాల్లో నటిస్తున్నాను. తెలుగులో బిజీగా ఉండటం వల్ల హైదరాబాద్‌లో ఇల్లు తీసుకున్నాను" అని పేర్కొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com